
BALA
CHELIMI

BALA




OCT
2025

OCT

₹40

అక్టోబర్ - 2025

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

**Telugu Children's Monthly Magazine**

సంపుటి : 35 • సంచిక : 1

OCTOBER - 2025



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186, Behind SBH(H.O)
Gunfoundry, Hyd-1.
Ph: 66468646, 23203108

**AMEERPET**
Lane Opp. Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS






Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

సంపుటి: Volume: **35** | సంచిక : Issue : **1** | హైదరాబాద్ Hyderabad | అక్టోబర్ October | పేజీలు Pages **52** | రూ. ₹. **40**











**లోపలి పేజీల్లో.......**




| | | |
|---|---|---|
| భౌగోళిక వైవిధ్యం జీవ వైవిధ్యానికి వెన్నెముక... | మణికొండ వేదకుమార్ | 5 |
| గర్వించదగిన భారతీయ భౌతిక శాస్త్రవేత్త : హోమీ జహంగీర్ బాబా (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| నిదానమే ప్రధానం (ప్రపంచ నత్తి నివారణ అవగాహన దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| మలావత్ పూర్ణ | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| ఆత్మ విశ్వాసం (కథ) | వై. అక్షయ | 11 |
| దసరాకు డ్రెస్ వద్దు - బాలచెలిమి ముద్దు | లక్ష్మీపూర్ జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు | 12 |
| బొమ్మలేద్దామా... | | 12 |
| రారండోయ్ (కథ) | యలమర్తి అనూరాధ | 13 |
| పదాల స్కోరు (ఆట).. | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి - 5 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| వేమన పద్యాలు | | 16 |
| మన బాట (కథ) | జి. శ్రేష్ఠ | 17 |
| తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు (ఎఐ)తో పిల్లలకు ఆధునిక విద్య. | లత | 18 |
| తెలంగాణలో బౌద్ధం తొలి అడుగులు...(యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి | 19 |
| నీటి మీద గుండు సూది (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| దివ్వెల కేళి దీపావళి (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 21 |
| నోబెల్ బహుమతులు పొందిన ఏడుగురు జె.జె.థామ్సన్ శిష్యులు (సైన్స్ వెన్నెల-12) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| నిమ్మ చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| మన జాతి పిత గాంధీ (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| నవంబరులో అంధుల మహిళల తొలి టీ20 ప్రపంచ కప్ (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| కోరుకున్న మూడు అంకెల సంఖ్య (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 28 |
| దసరా - పిల్లల సరదా | కృష్ణ పద్మ | 29 |
| బుజ్జి కుందేలు ఇక సెలవ్ (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| నలుగురు సోదరులు - అస్థిపంజరం కథ | పంచతంత్ర కథ | 32 |

| | | |
|---|---|---|
| కనువిప్పు (పాట) | బూర్లే నాగేశ్వరరావు | 33 |
| రెండు వెల ఏండ్ల క్రిందట వ్యాపార వాణిజ్యాలు (చరిత్ర పాఠాలు-8) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 35 |
| సఫీనా హుస్సేన్ : ఒక బాలిక చదువుతో సమాజానికే వెలుగు | బాలచెలిమి డెస్క్ | 36 |
| కళ్ళద్దాలతో దూరదర్శిని సూత్రం | బాల కథా సౌరభం | 37 |
| చెలిమి క్లబ్ | బాలచెలిమి | 38 |
| ఎక్కడిదమ్మా ఈ కోతీ... | గంగదేవు యాదయ్య | 38 |
| భారతదేశంలో విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో 2025లో కీలక పురోగతులు | యోగిత | 39 |
| నిజమైన స్నేహితుడు (కథ) | ఎ. మృదుల | 41 |
| నేర్చుకుందామా | | 42 |
| కలం-చెలిమి | | 42 |
| భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన సవరణల జాబితా (జి.కె.) - 2 | బాలచెలిమి డెస్క్ | 43 |
| అలా జరగాల్సిందే (కథ) | బి.వి. పట్నాయక్ | 45 |
| ప్రపంచంలో అత్యంత అపూర్వమైన పాంగోలిన్ (జంతువు) | సచిన్ కోత్వాల్ | 46 |
| తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బాల చెలిమి గ్రంథాలయం ప్రారంభం | నాగరాజు కామర్సు | 47 |
| సమాచారం | బాలచెలిమి డెస్క్ | 48 |
| చిన్ననాటి ఆటలో చిత్తరాల ఆటలో... (పాట) | | 49 |
| డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య (వ్యక్తిత్వం) | సువేగా | 50 |




# చెలిమి లేఖలు

సార్ నమస్కారం.. సెప్టెంబర్ నెల బాల చెలిమి సంచిక చాలా అద్భుతంగా వచ్చింది. గతంలో ఉన్న సంచికలకు ఈ సంచికకు చాలా తేడాలు ఉన్నాయి. బొమ్మల పరిణామం పెరిగింది కథల నిడివి తగ్గింది. చాలా ఆకర్షణీయంగా ఉంది. పిల్లలు సులువుగా చదివే విధంగా ఉండి బాలలకు చేరవేస్తున్నందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదాలు సార్.

**- కె. బుచ్చిరెడ్డి,**
ఉపాధ్యాయుడు, చిన్న మాదారం పాఠశాల

అందరికీ నమస్కారం, బతుకమ్మ - దసరా పండుగ సందర్భంలో పిల్లలు సాధారణంగా కొత్త బట్టలు కోరడం సహజం. అయితే ఈ విద్యార్థినులు వినూత్నమైన ఆలోచనతో ముందుకు వచ్చి, తమకు బాలచెలిమి మాస పత్రిక కావాలని తల్లిదండ్రులను కోరడం ప్రశంసనీయం. చదువుపై మక్కువ చూపుతూ "బాలచెలిమి" మాసపత్రికను మాకు అందించ గలరని, తమ విన్నపంను వీడియో రూపంలో చిత్రికరించి వాట్సాప్ ద్వారా తమ సందేశాన్ని బాలచెలిమి సంపాదకులు మరియు బాలచెలిమి బృందానికి పంపించాం అని తెలియ జేస్తున్నాము. ధన్యవాదాలు సార్...

**-ఎస్. నాగలక్ష్మి, బి. ప్రతిజ్ఞ**
ఏడవ తరగతి, లక్ష్మీపూర్ జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు

అనంతారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, ఆసక్తి, నైపుణ్య పటిమ పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు.

**- ప్రధానోపాధ్యాయులు**
జెడ్‌పిహెచ్‌ఎస్, అనంతారం


*Cover Picture*
"విద్యా మార్గంలో నవ్వుల ప్రయాణం"
సఫీనా ఆర్టికల్

*Source from:*
నమస్తే తెలంగాణ

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728






సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# భౌగోళిక వైవిధ్యం జీవ వైవిధ్యానికి వెన్నెముక...

పిల్లలూ.... మీ అందరికీ దసరా, దీపావళి శుభాకాంక్షలు.


అక్టోబర్ 6న భూ వైవిధ్య (జియో డైవర్సిటీ) దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భూ వైవిధ్యం జీవ వైవిధ్యానికి (బయోడైవర్సిటీ) పునాది. ఏదైనా ప్రదేశంలో అధిక మొత్తంలో అనేక జాతులకు చెందిన జీవులు ఉండటాన్ని జీవ వైవిధ్యం అంటారు. ఈ జీవ వైవిధ్యం మానవజాతితో సహా సమస్త జీవరాసుల మనుగడకు, అభివృద్ధికి తప్పనిసరి అవసరం. జీవ వైవిధ్యంలోని సమతుల్యత ప్రకృతి, పర్యావరణ సమతుల్యతలను కాపాడుతుంది. ఎలాంటి విపత్తులు లేని సుస్థిరమైన సమాజ మనుగడ అప్పుడే సాధ్యమవుతుంది.

జీవ వైవిధ్యం జీవరాసులకు సంబంధించిన అంశం. భూవైవిధ్యం అజీవ అంటే జీవం లేని సమూహాలకు సంబంధించిన అంశం. రాళ్ళు, నేలలు, ఖనిజాలు, శిలాజాలు, పర్వతాలు, లోయలు, నదులు, హిమనీనదాలు వంటి సహజమైనవి ఈ సమూహంలో వున్నాయి. అయితే ఇవన్నీ అన్ని చోట్లా ఒకే ధర్మాన్ని, గుణాన్ని కలిగి వుండవు. వేర్వేరు ప్రాంతాలలో, వేర్వేరు కాలాల్లో భిన్నభిన్నంగా వుంటాయి. భూమి ఉపరితలం అన్ని చోట్లా ఒకే రకంగా వుండదు. ఒకచోట ఎత్తైన పర్వతాలుంటే, మరికొన్ని చోట్ల మైదానాలు, ఎడారులు, లోయలు, అరణ్యాలు. పీఠభూములు కనిపిస్తాయి. ఒక్క భూమిలోనే ఇన్ని వైవిధ్యాలు కనిపిస్తున్నపుడు మిగతా అంశాలు రాళ్ళు, ఖనిజాలు, శిలాజాలు, నదులు వంటి వాటిలో ఎన్నో వైవిధ్యాలు ఉంటాయి కదా! వీటన్నిటి వైవిధ్యాలను భూ లేదా భౌగోళిక వైవిధ్యాలు అంటారు. ఈ భూ వైవిధ్యం జీవ వైవిధ్యానికి కీలకమైనది. నీటి వనరులు, ఖనిజ సంపద, వ్యవసాయం, పరిశ్రమలు వంటివి ఎన్నో దీని ఆధారంగా అభివృద్ధి చెందుతాయి. విద్య, పరిశోధన, పర్యాటకం, స్థానిక ప్రజల జీవన విధానం, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక ప్రగతిని నిర్దేశించే శక్తి దీనిలో వుంది. ఖనిజాలు, రాళ్ళు, నీటి వనరులు మానవ శ్రేయస్సుకి అవసరమైనవి.

ప్రకృతి విపత్తుల అవగాహన వల్ల భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాల పేలుడు, వరదలు, కొండ చరియలు పడిపోవడం వంటి విపత్తులను అంచనా వేసి నివారించవచ్చు. వాతావరణ మార్పులపై జ్ఞానం గత వాతావరణ మార్పులను అర్థం చేసుకోవడానికి, భవిష్యత్ వాతావరణ మార్పులకు వ్యూహాలు రూపొందించడానికి ఉపయోగపడుతుంది. భౌగోళిక పర్యాటకానికి (జియోటూరిజం) దోహదం చేస్తుంది. వనరుల స్థిరమైన వినియోగం, పునరుత్పత్తిపై జ్ఞానాన్ని యిస్తుంది.

భూవైవిధ్యాలు బహుముఖీనమైనవి. చరిత్రను అర్థం చేసుకోవడానికి భూమి సహజమైన ప్రయోగశాల. భౌగోళిక వైవిధ్యం నిరంతర ప్రాధాన్యత కలిగి వుంటుంది. ఈ స్పృహను జియో డైవర్సిటీ డే మనకు యిస్తుంది.

పిల్లలూ... ఓ పది రోజులు దసరా సెలవులు వచ్చాయి కదా. మీ అమ్మా నాన్నలతో తాతయ్యలు, నాయనమ్మ, అమ్మమ్మల దగ్గరకు వెళ్ళి హాయిగా గడపండి. మీ కజిన్స్‌తో కలివిడిగా స్నేహం చేయండి. అక్కడ మీ అనుభవాలను, అనుభూతులను యాత్రానుభవాలుగా రాసి బాలచెలిమికి పంపండి.



వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)


ఎడిటర్ బాలచెలిమి



# గర్వించదగిన భారతీయ భౌతిక శాస్త్రవేత్త హోమీ జహంగీర్ బాబా



Homi J Bhabha



భారతీయ భౌతిక శాస్త్రవేత్త హోమీ జహంగీర్ బాబా 1969 అక్టోబర్ 30న ముంబైలో జన్మించారు. ప్రాథమిక విద్యను, ఉన్నత విద్యను ముంబైలో అభ్యసించారు. మెకానిక్ ఇంజనీర్ చదువు కోసం కేంబ్రిడ్జ్‌లోని గాన్‌విల్ అండ్ క్యాయస్ కాలేజీలో చేరాడు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు, శాస్త్రవేత్త పాల్ డైరాక్ స్ఫూర్తితో గణిత, భౌతిక శాస్త్రాల పట్ల ఆసక్తి పెరిగింది. 1930లో ఇంజనీరింగ్ డిగ్రీని, 1934లో పిహెచ్‌డి పట్టాను పొందారు.

అంతరిక్షం నుండి భూమి మీదకి అతివేగంగా వచ్చే అతి సూక్ష్మ కిరణాలను కాస్మిక్ రేఖలు (Cosmic Rays) అంటారు. ఇవి భూమి వాతావరణంలోకి ప్రవేశించినప్పుడు గాలి అణువులు ఢీకొని ఎలక్ట్రాన్ల వర్షాన్ని సృష్టిస్తాయి. వీటిలో అణు కణాలు వున్నట్లు 1937లో తన ప్రయోగాల ద్వారా కనుగొన్నాడు. వీటిని మెసాన్లు అని పిలిచారు. ఈ విశ్లేషణ ద్వారా బాబా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు.

మన దేశంలో మౌలిక పరిశోధనలకు అంకితమైన సంస్థ అవసరమని భావించి 1945లో ముంబైలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ (టిఐఎఫ్ఆర్) స్థాపనకు కృషి చేసారు. జీవితాంతం దానికి డైరెక్టర్‌గా ఉన్నారు. 1941లో లండన్ రాయల్ సొసైటీ ఫెలోషిప్ పొందారు. 1948లో అంతర్జాతీయ అణుశక్తి కమీషన్‌కి ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన మార్గదర్శకత్వంలో అప్సరా, సైరస్, జెర్లినా వంటి అణు రియాక్టర్లు నిర్మించబడ్డాయి. అణుశక్తి ఉపయోగాలపై ఐక్యరాజ్య సమితి జెనీవాలో నిర్వహించిన తొలి సదస్సుకు అధ్యక్షత వహించారు. ఆడమ్స్ అవార్డు, పద్మభూషణ్, అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ గౌరవ ఫెలోషిప్ వంటి అనేక గౌరవాలు పొందారు. బాబా కృషితోనే అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో ఏర్పాటైంది. జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ టెంపర్‌కి ఎడిటర్‌గా పని చేశారు.

బాబాకి సంగీతం, చిత్రకళ, రచనల పట్ల ప్రత్యేకమైన అభిరుచి, అభినివేశమూ ఉన్నాయి. బాబా వేసిన కొన్ని చిత్రాలు బ్రిటన్‌లోని ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించబడ్డాయి. ఆధునిక కళా సేకరణలో ఆయన స్థాపించిన TIFR ఆర్ట్ కలెక్షన్ దేశంలోనే అగ్రగామిగా ఉంది.

అణు కార్యక్రమ పితామహుడిగా పేరొందిన భారతీయ విప్లవాత్మక న్యూక్లియర్ సైంటిస్ట్ హోమీ బాబా 1966 జనవరి 24న మరణించారు.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998



# నిదానమే ప్రధానం



హాయ్ ఫ్రెండ్స్, 'నిదానమే ప్రదానం' అంటూ సూక్తులు చెబుతున్నాననుకుంటున్నారా. కొన్ని సమయాలలో నెమ్మదిగా ఉండడం, నిదానంగా మాట్లాడడం చాలా అవసరం. మాట్లాడేటప్పుడు ఆలోచించి, తప్పులు లేకుండా, స్పష్టంగా మాట్లాడాలి. అప్పుడే ఎదుటి వారికి మీ మాటలు, భావం అర్థమవుతుంది. ఎలాగంటే మాట్లాడేటప్పుడు అక్షరాలు ఒకదాని తరువాత మరొకటి నిర్దిష్ట సమయంలో ఉచ్చరించడం వలన ఇతరులకు ఆ ధ్వనులు స్పష్టంగా వినిపిస్తాయి. ఆ ధ్వనులే అక్షరాలుగా, పదాలుగా, అర్థాన్నిచ్చే వాక్యాలుగా మనకు వినిపిస్తాయి. ఎవరైనా తొందరగా మాట్లాడితే అర్థం కాదు. అలాగే భయంతో, ఆందోళనతో మాట్లాడినప్పుడు చెప్పిన పదమే మళ్లీ చెబుతుంటారు. కొన్ని అక్షరాలు సరిగా పలకలేరు. అంటే ధ్వనులను సరిగా పలకలేరు. అప్పుడు అర్థంకాక 'నిదానంగా మాట్లాడు' అని చెబుతాం కదా. పిల్లలూ మీకు ఎప్పుడైనా అలాంటి సందర్భం ఎదురైందా? అలా మాట్లాడడాన్ని 'నత్తి' అని అంటారు. మీ స్కూల్లో కూడా అలా మాట్లాడేవాళ్లని గమనించే ఉంటారు. నత్తి ఏ వయసులో ఎప్పుడు వస్తుందో తెలుసుకుందాము.

నత్తి అంటే అసంకల్పిత పునరుక్తుల ద్వారా ప్రసంగ ప్రవాహానికి విఘాతం కలిగించటం. అలాగే శబ్దాలు, పదాంశాలు, పదాలు, పదబంధాల యొక్క పొడిగింపు అని చెప్పవచ్చు. ధ్వనులను స్పష్టంగా పలకకపోవడం, అసంకల్పితంగా నిశ్శబ్ద అంతరాయాలు, మాటలు తడబడడం, ముద్ద ముద్దగా మాట్లాడడం, కొన్ని అక్షరాలు సరిగా పలకలేక పోవడం మొదలగు లక్షణాలన్నీ నత్తికి సంబంధించినవే.

అయితే నత్తి అనేది ఒక రోగం కాదు. నత్తిగా మాట్లాడే వారిలో ఎటువంటి శారీరక సమస్య లేదని తెలుసుకోవాలి. దీనికి మందులు, శస్త్ర చికిత్స లాంటివి అవసరం లేదు. మానసిక ఒత్తిడి, భయాన్ని తగ్గించే ప్రత్యేక చికిత్సా విధానం ద్వారా నత్తిని నయం చేయవచ్చు. ఒక్కోసారి చిన్న వయసులో మెదడుకి సంబంధించిన జబ్బుల వల్ల కూడా నత్తి రావచ్చు. నత్తి రావడానికి కొంత వరకు జన్యువులు కూడా దోహదం చేస్తాయి. అనుకరణతోనూ నత్తిగా మాట్లాడడం అలవాటు అవుతుంది. అమ్మాయిలలో కంటే అబ్బాయిలలో నత్తి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ నత్తి ఎక్కువగా 2 నుండి 5 ఏళ్ల వరకు ఉన్న పిల్లలలో కనిపిస్తుంది.

నోటి నుండి మాటలు వెలువడడానికి ముందే మెదడులో వాక్యాలు ఏర్పడుతాయి. కాబట్టి నెమ్మదిగా మాట్లడడం అలవాటు చేసుకోవాలి. అంటే కొంత రాగం తీస్తున్నట్లు. నత్తి ఉన్నవారు పాడేటప్పుడు తడబడరు. అందుకే గాత్ర సంగీతం నేర్చుకోవడం నత్తి తగ్గడానికి మంచి చిట్కా. పిల్లలు భయంతో లేదా ఆత్రుతలో నత్తిగా మాట్లాడడం ప్రారంభించి నపుడే యోగా చేయించాలి. శ్వాస మీద నియంత్రణ సాధించడం వల్ల కూడా నత్తిని నివారించవచ్చు. తల్లిదండ్రులు కాని ఉపాధ్యాయులు కాని పిల్లలలో ఇటువంటి లక్షణాలు గమనిస్తే తొలిదశ లోనే చికిత్స చేయించాలి. అంటే స్పీచ్ థెరపీ కొంత వరకు ఉపయోగపడవచ్చు. స్కూల్లో రీడింగ్ పిరియడ్‌లో పిల్లలతో పైకి చదివించాలి. బయటికి గట్టిగా చదవడం వల్ల నత్తి లేని వారిలో కూడా ఉండే ఉచ్చారణా లోపాలను సరిచేయవచ్చు.

"Stuttering may be an obstacle, but it's not the end of the road".

ప్రపంచవ్యాప్తంగా పిల్లలలో ఉన్న నత్తిని నివారించడానికి, ప్రజలలో అవగాహన పెంచడానికి 1998 నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న ప్రపంచ నత్తి నివారణ అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఇంటర్నేషనల్ ఫ్లూయెన్సీ అసోసియేషన్, ఇంటర్నేషనల్ స్టట్టరింగ్ అసోసియేషన్, యూరోపియన్ లీగ్ ఆఫ్ స్టట్టరింగ్ అసోసియేషన్ సంస్థలు సమావేశమై నత్తి పై అవగాహన కలిగించటం ద్వారా దానిని నివారించవచ్చని భావించాయి. వీటితో కలిసి భారతదేశం లోని స్టామరింగ్ అసోసియేషన్ (The Indian Stammering Association) పని చేస్తోంది. అలాగే నత్తి ఉన్న వారితో ఎలా ప్రవర్తించాలో కొన్ని సూచనలను చేసారు. అవి:

1. నత్తి ఉన్నవారు చెబుతున్నప్పుడు సహనంగా వారి మాటలను వినాలి.
2. వారి మాటలను, వాక్యాలను మనం చెప్పటానికి ప్రయత్నించ కూడదు. అది వారికి చిరాకును కలిగిస్తుంది.
3. వారు మాట్లాడేటప్పుడు కళ్లలోకి చూడాలి. ముఖ్యంగా వారు ఎలా చెబుతున్నారో అని కాక, ఏం చెబుతున్నారో అనే దాని పై శ్రద్ధ పెట్టాలి.
4. పిల్లలతో మాట్లాడేటప్పుడు నిదానంగా మాట్లాడాలి. చిన్న, చిన్న వాక్యాలలో మాట్లాడాలి.
5. వారికి అర్థమయ్యేటట్లు సులభమైన వాడుక భాషలో మాట్లాడాలి.

"Your voice has value, whether it stutters or sings".

నత్తి గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాము. 8% పిల్లలు ఏదో ఒక సమయంలో నత్తిగా మాట్లాడుతారట. ఒక అధ్యయనం ప్రకారం వయసు పెరిగే కొద్దీ ఈ సమస్యను అధిగమించవచ్చు. కానీ కొందరిలో మార్పు ఉండదు. మరి కొందరిలో తీవ్రమవుతుంది. వీరు నాలుగు లేదా ఐదు నెలల థెరపీతో, కౌన్సిలింగ్‌తో, మానసిక వైద్య నిపుణుల సలహాలతో నత్తి సమస్యను అధిగమిస్తారు. వాస్తవంగా నత్తి ఉన్న పిల్లలు తెలివికలవారు. కొన్నిసార్లు ఆలోచనల కన్నా మాట్లాడడానికి అవసరమైన కండర కదలికల సమన్వయ వేగం తక్కువగా ఉండచ్చు. అంటే మాట్లాడే వేగం కన్నా ఆలోచనల వేగం పెరిగినప్పుడు పదాలు, వాక్యాలు నత్తి, నత్తిగా వస్తుంటాయి. దీంతో గాబరా, ఆదుర్దాకు లోనవుతారు. ఈ సమస్య ఉన్న పిల్లలకు ఇంట్లో, బడిలో తగిన సాయం ఇస్తే అది లోపంగా మారదు. చాలా సార్లు ఉపన్యాసకులు అద్దం ముందు నుంచొని తమ ప్రసంగాన్ని సాధన చేస్తారు. అలాగే వీరు కూడా మాట్లాడుతూ, ఏ పదాలు తడబడుతున్నారో చూసుకోవాలి. శ్వాస లోపాలు ఉన్నాయేమో అని గమనించాలి. ఇక ముందు మీరు నత్తి ఉన్నవారితో మాట్లాడాల్సి వస్తే పైన చెప్పుకున్న విషయాలను గుర్తు చేసుకుందాం. వారితో స్నేహపూర్వకంగా ఉందాం.

"The magic of the coconut tree lies in the sweet water within".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

చందదారులుగా చేరండి! బాలచెలిమి చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

◈ షీరోస్

# మలావత్ పూర్ణ

## ధైర్య, సాహసాలతో అత్యున్నత శిఖరాలకు...

తెలంగాణ రాష్ట్రంలోని ఒక గిరిజన గూడెంలో మలావత్ పూర్ణ (2000 జూన్ 10– ) పుట్టారు.

ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన పిన్న వయస్కులలో ఒకరిగా, తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

13 ఏళ్ల వయసులో 2014లో ఎవరెస్ట్ శిఖరంలో అతి ఎత్తైన భాగానికి చేరుకున్న బాలికగా గుర్తింపు పొందారు. నిజానికి, ఈ పని చేయడానికి శారీరకంగా, మానసికంగా గొప్ప సామర్థ్యం కావాల్సి ఉంటుంది. పూర్ణ చేసిన ఈ అసాధారణ ప్రయాణం అత్యున్నత శిక్షణతో, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సహకారంతో సాధ్య పడింది.




పిన్న వయసులో ఆమె సాహసం చాలా మంది యువతకు, ముఖ్యంగా సామాజికంగా వెనకబడిన వర్గాల యువతకు, తమ కలలను సాకారం చేసుకోవాలనుకునే వారికి, జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించాలనుకునే వారికి ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది. మలావత్ పూర్ణ తన చదువుకు ప్రాధాన్యం ఇస్తూనే సాహసోపేత పర్వతారోహణ కార్యక్రమాలు కొనసాగించారు.

ఆటంకాలు అధిగమించి, అసాధ్యం అనుకునే శిఖరాలను సంకల్పం, పట్టుదలతో ఎలా సాధ్యం చేసుకోవచ్చో ఆమె జీవితం అందరికీ ఒక స్ఫూర్తిదాయక ఉదాహరణ. ఆమె జీవితం ఆధారంగా 'పూర్ణా: ద ఎంగెస్ట్ గర్ల్ ఇన్ ద వరల్డ్ టు స్కేల్ మౌంట్ ఎవరెస్ట్' అన్న పుస్తకాన్ని అపర్ణ తోట రాశారు.

– 'షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

### మీకు తెలుసా?

ఆమె జీవిత కథ ఆధారంగా రాహుల్ బోస్ దర్శకత్వంలో, 'పూర్ణ: సాహసానికి ఎల్లలు లేవు' పేరుతో తీసిన సినిమా 2017లో విడుదల అయింది.

# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం



గడియారంలో గంటలు చూడు
గజము అంటే 'ఏనుగు' అని అర్థం
గంట, గద, గగనం పదాలలో
ముందర ఏ అక్షరముంది చెప్పండి? "గ" అక్షరం





ఘటమంటే "కుండ" అని తెలుసా?
ఘటోత్కచుడు భీముని కొడుకని తెలుసా?
ఘర్మజలమంటే చెమటని తెలుసా?
"ఘటము"లో మొదటి అక్షరం ఏముంది? "ఘ" అక్షరం

'ఙ' అంటే భైరవుడని అర్థముంది తెలుసా?
'ఙవనము' అంటే చప్పుడని అర్థముంది ఎవరికేనా?
'ఙ'లో పదాలు తక్కువని తెలుసా?
'ఙవనము' తో మొదటి అక్షరాన్ని ఏమంటారు? "ఙ" అక్షరం






చంటిపాప చందమామను చూసి మురిసె
చక్కనయ్య చంకెనెక్కి ఆడుచుండె
చందనము చకచక నూరె చమటరాంగ
"చందమామ"లో ముందర ఎవరున్నారు పాప "చ" అక్షరం



ఛత్రము లేకుంటే ఎండ, వానలో తిరుగలేము
ఛత్రపతి శివాజీ గొప్ప చక్రవర్తి
ఛత్రాకి అంటే పుట్టగొడుగని తెలుసా?
ఈ మూడు వాక్యాల్లో ముందు ఏ అక్షరముంది? "ఛ" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ




# ఆత్మ విశ్వాసం

రామవరం అనే ఒక చిన్న ఊరిలో నవ్య, కావేరి అనే ఇద్దరు స్నేహితురాల్లు ఉండేవారు. చదువులో వారిద్దరూ చాలా తెలివైనవారు. ఆ ఊరిలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు.

ఇద్దరికీ చదువు అంటే చాలా ఇష్టం. నవ్యకు డాక్టర్ కావాలనే కోరిక ఉండేది. కానీ ఆత్మవిశ్వాసం తక్కువ. కావేరికేమో లాయర్ కావాలని బలమైన కోరిక ఉండేది. చాలా ధైర్యవంతురాలు. ఎంతోమంది అమాయకులు చదువు రాక అన్యాయానికి గురవుతున్నారని బాధపడుతుంది. వారికి సహాయం చేయాలని నిశ్చయించుకుంటుంది. కావేరికి తన లక్ష్యాన్ని ఏనాటికైనా చేరుకుంటాననే నమ్మకం ఉండేది. నవ్య ఎప్పుడు అనుమానంతో తన లక్ష్యాన్ని చేరుతానో లేదో అని బాధ పడుతూ ఉండేది. ఎవరైనా ఏదైనా ప్రతికూలంగా చెప్తే దానినే నమ్మేది. ఒకరోజు నవ్య, కావేరి వాళ్ళ లక్ష్యాన్ని ఎలా చేరుకోవాలో అనుకుంటూ పాఠశాలకు వెళుతుంటే ఆ ఊరిలో పని పాటా లేని కొందరు “మీరు అమ్మాయిలు మీకు చదువెందుకు? చక్కగా పెళ్లి చేసుకుంటే సంతోషంగా ఉండవచ్చు” అని అంటారు. గ్రామీణ ప్రాంతాల వారు గొప్ప గొప్ప ఉద్యోగాలు చేయలేరు. మీ నుంచి కాదు అని నిరుత్సాహపరుస్తారు. దానితో నవ్య ఆలోచించడం మొదలు పెట్టింది. నేను నా లక్ష్యాన్ని చేరుతానో లేదో అని అనుమాన పడుతుంది. నా చదువు ఆపేసి పెళ్లి చేసుకోవడం

మంచిదేమో అనుకొని తన నిర్ణయం మార్చుకుంటుంది. అదే సందర్భంలో ఇంట్లో మంచి సంబంధం రావడం వలన నవ్య పెళ్లి కుదురుతుంది. దానితో ఆమె కోరిక తీరకుండా పోతుంది. తన భర్తది చాలీచాలని సంపాదన. సంసారం, ఇద్దరు పిల్లలతో చాలా బాధపడుతుండేది. పెళ్లి చేసుకోకుండా చదువుకుంటే బాగుండేది అని ఆలోచిస్తుంది. కానీ పరిస్థితులు సహకరించవు. నవ్య స్నేహితురాలు కావేరి ఆ ఊరి ప్రజల మాటలను పట్టించుకోలేదు. తన లక్ష్యాన్ని చేరుతానని ఆత్మవిశ్వాసంతో చెప్పి కష్టపడి చదివి లాయర్ అవుతుంది. తన తెలివితో ధైర్యంగా కేసులను వాదించి మంచి పేరుతో పాటు, డబ్బు కూడా బాగా సంపాదించింది. ఎంతో మంది పేదలకు సహాయం చేస్తుంది. చాలా రోజుల తర్వాత నవ్యను కలిసిన కావేరి తన పరిస్థితిని చూసి చాలా బాధపడుతుంది. నేను నీలాగా కొంచెం ధైర్యం చేసి ఉంటే ఈరోజు నాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. నేను కూడా వైద్యురాలుగా పేద ప్రజలకు సేవ చేస్తూ సంతోషంగా ఉండేదాన్ని. నా పిల్లలను చక్కగా చూసుకునే దాన్ని. నాకు ఈ కష్టాలు ఉండేవి కావు అని చెప్తుంది. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు ఏదైనా మంచి ఉద్యోగం సంపాదించు. నేను నీకు సహాయం చేస్తానని కావేరి అంటుంది. కావేరి చెప్పిన ధైర్యంతో ఆగిపోయిన చదువును కొనసాగిస్తుంది. తర్వాత కావేరి సహాయంతో మంచి ఉద్యోగాన్ని సంపాదిస్తుంది. ఇద్దరు కలిసి పేద ప్రజలకు అనేక రకాల సేవలు చేస్తారు. అనాధ పిల్లలకు చదువులు చెప్పిస్తారు. వృద్ధులకు వైద్య సేవలు చేస్తారు. మంచి స్నేహితులుగా పేరు తెచ్చుకుంటారు. సేవా రంగంలో అనేక బహుమతులు అందుకుంటారు. జీవితంలో ఎవ్వరు ఎన్ని రకాలుగా నిరుత్సాహపరిచిన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. అప్పుడే మనకు విజయం దక్కుతుంది.

– వై.అక్షయ
10వ తరగతి, తెలంగాణ ఆదర్శ పాఠశాల
లింగాల ఘణపురం మండలం, జనగామ జిల్లా
m : 9908628430

## దసరాకు డ్రెస్ వద్దు - బాలచెలిమి ముద్దు




బతుకమ్మ - దసరా పండుగ సందర్భంలో పిల్లలు సాధారణంగా కొత్త బట్టలు కోరడం సహజం. అయితే ఈ విద్యార్థినులు వినూత్నమైన ఆలోచనతో ముందుకు వచ్చి, తమకు బాలచెలిమి మాస పత్రిక కావాలని తల్లిదండ్రులను కోరడం ప్రశంసనీయం. “బాలచెలిమి” మాసపత్రికను మాకు అందించగలరని, మా విన్నపంను వీడియో రూపంలో చిత్రికరించి వాట్సాప్ ద్వారా మా సందేశాన్ని బాలచెలిమి సంపాదకులు మరియు బాలచెలిమి బృందానికి పంపించాం అని తెలియజేస్తున్నాము. ధన్యవాదాలు సార్...

– లక్ష్మీపూర్ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థులు, ఆదిలాబాద్
m : 9441473049


## బొమ్మలేద్దామా...



నందన్ కృష్ణ, 4వ తరగతి, 7 సంవత్సరాలు, జెనీవా

కథ

# రారండోయ్



అనగా అనగా ఒక చీమ. రోజూ లాగానే ఆహారం వెతుక్కోవటానికి బయలుదేరింది. ఎవరి కాలి క్రింద పడి పచ్చడి అయి పోతానో అని జాగ్రత్తగా పక్కపక్కగా నడుచుకుంటూ వెళుతోంది. మనుషులు ఇదివరకటిలా లేరు. ఏవో పాపం ప్రాణులు అని పాతకాలం వాళ్ళు పట్టించుకునే వారు కాదు. తమను ఏమీ చేసే వాళ్ళు కాదు. కానీ ఇప్పటి వాళ్ళు తమని కట్టడి చేయటానికి 'లక్ష్మణ రేఖ'ని కనిపెట్టారు. దాంతో ఓ గీత గీస్తే చాలు ఆ దరిదాపులకు కూడా వెళ్లలేకపోతున్నాం. ఒకదానితో ఆగకుండా ఇంకా రకరకాలు కనిపెట్టి అడ్డుకుంటున్నారు. ఇక్కడ కాకపోతే ఇంకోచోట శ్రమ పడేతత్వం తనది కాబట్టి భయపడకుండా వెతికి తన కడుపు నింపుకోవడమే కాకుండా తన పిల్లలకూ పెట్టగలుగుతోంది అని అనుకుంది చీమ.

అపార్ట్‌మెంట్లో వంటిల్లు అంతా వెతికినా ఏం దొరకలేదు. నిరాశగా బాల్కనీలోకి వెళ్ళింది. దాని కళ్లు మెరిసాయి. అక్కడ ప్లేట్లో పంచదార ఆరబెట్టి ఉంది. పొరపాటున నీళ్లు పడి ఉంటాయి. తన అదృష్టం పండింది అని సంబరపడి మిగతా చీమలకు కబురు పంపింది. అవి దారిలో కనిపించిన వాళ్లందరికీ చెప్పి మరీ పిలుచుకుని వస్తున్నాయి. అలా చీమలు ఒకటి కొకటి చెప్పుకోవటం చూసిన దోమ అడగనే అడిగింది.

"ఎందుకలా అందరికీ చెప్తావు? మనుషుల్ని చూడు ఏదైనా దొరికితే దాచేసుకుంటారు కానీ పక్క వాళ్లకు చెప్పరు" అంది.

"వాళ్ళకి స్వార్థం ఎక్కువ. మాకు అది లేదు. ఉన్నది మేము అందరం పంచుకుంటాం. అందుకే రమ్మని పిలుచుకొని మరీ తీసుకువెళ్తాం మా వాళ్ళని" అంది చీమ.

"అవును. మనుషులు చాలా చెడ్డ వాళ్ళు" అంది దోమ.

"అలా ఎందుకన్నావు?" అడిగింది చీమ.

''మనం కుట్టగానే ఒక్క దెబ్బతో మనల్ని చంపేస్తారుగా" అంది దోమ.

"మన పుట్టలో వేలు పెడితే మనం కుట్టమా? వాళ్ళూ అంతే".

"బాధ కలిగించడానికి, చంపటానికి చాలా తేడా ఉందిలే చీమ మామా!"

"అల్పప్రాణులం కాబట్టి చచ్చిపోతున్నాం. అది వాళ్ళ తప్పు ఎలా అవుతుంది?"

"నీ అంత మంచితనం నాకు లేదు బాబూ. వాళ్ళ రక్తం పీల్చడం పారిపోవటమేగా నా పని".

"సరే. నా పని నన్ను చేసుకోనీ. శ్రమజీవులు అని మమ్మల్ని అందరూ మెచ్చుకుంటారు. ఇలా కబుర్లతో పని మానుకుంటే మాకు ఉన్న ఆ పేరు పోతుంది" అంటూ పంచదార పట్టుకెళ్ళటానికి హడావిడిగా వెళ్లిపోయింది చీమ.

అందరూ మనవాళ్లే అనుకోవాలి– ఈ కథకి నీతి.

– యలమర్తి అనూరాధ
m : 9247260206

ఆట

# పదాల స్కోరు



కావలసిన వస్తువులు:



పెన్సిళ్ళు



పేపరు

ఎంత మంది పాల్గొన వచ్చు - ఇద్దరు నుంచి ఇద్దరు నుండి అయిదుగురు

ఎక్కడ ఆడవచ్చు - గదిలో లేదా ఆరు బయట

ఆటగాళ్ళ వయస్సు - 6 నుండి 10 సంవత్సరాలలోపు మధ్య

'పదాల స్కోరు' ఆటలో ప్రతి అక్షరాన్ని గడులలో చేర్చడం ద్వారా వచ్చే పదాల సంఖ్యను స్కోర్ చేయడం ఈ ఆట ప్రత్యేకత.

ముందుగా ఆటగాళ్ళు పది నిలువు, పది అడ్డం గళ్ళు గీసి తమ దగ్గర ఉంచుకోవాలి. ఒక ఆటగాడు 'ఆ' అని ఒక గడిలో రాస్తే రెండవ ఆటగాడు 'ఆ' పక్కన 'శ' పెడితే ఆశ అవుతుంది. ఇప్పుడు రెండు పాయింట్లు ఆ ఆటగాడు తన ఖాతాలో రాసుకోవచ్చు. ఇలా ప్రతి అక్షరం చివర పేర్చే అక్షరాలను బట్టి రకరకాల అర్థాలు వస్తాయి. ఇలా అర్థాలకు వచ్చే పదాలలోని అక్షరాల సంఖ్యను ఆ ఆటగాళ్లు తమ స్కోర్‌లో వేసుకుంటూ వుండాలి. మొత్తం గడులన్నీ అయిపోయాక ఎవరు ఎక్కువ స్కోర్ చేస్తే వారే విజేత. పదాలు నిలువుగా గాని, అడ్డంగా గాని, మూలగా గాని రాయాలి.

**ప్రయోజనం:** ఈ ఆట ఆడటం ద్వారా భాష మీద పట్టు లభిస్తుంది. ఆలోచనా శక్తిని మరియు జ్ఞాపక శక్తిని పెంచుతుంది.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

✢ సీరియల్-5




# బంగారు మర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

**(గత సంచిక తరువాయి...)**

ఒకరోజు పులిరాజు తన మిత్రుడు మృగరాజు సింహాన్ని కలవటానికి వస్తున్నట్లు కబురు పంపింది. దాంతో మృగరాజు చక్కటి విందుకు ఏర్పాట్లు చేసింది.

పులి రావడం గమనించి ఆసనం మీద నుంచి లేచి "మిత్రమా! మీ రాక మాకు ఎంతో ఆనందం...." అంటూ ఆహ్వానించింది. కానీ మిత్రుడి ముఖంలో, నడకలో నిరుత్సాహం స్పష్టంగా గమనించింది సింహం. పులి విందు కూడా ఆసక్తిగా ఆరగించలేదు. ఎక్కువగా నీటితోనే కడుపు నింపుకొంది.

"మిత్రమా! నా దగ్గర దాపరికం ఎందుకు? నీ కష్టం నాది కాదా!ఎందుకు అదోలా ఉన్నావు?" అని అడిగింది సింహం. పులి, మృగరాజు కళ్లలోకి చూస్తూ "మిత్రమా! మాకు ఓ పెద్ద కష్టమొచ్చి పడింది. మా రాజ్యంలో నీటి సమస్య అప్పటిలా పెరిగిపోతోంది. చెరువులన్నీ ఎండి పోవడంతో నీటికోసం అడవంతా తిరగాల్సి వస్తోంది" అంది. "అందుకే కదా..! మా అడవిలో ఎక్కువైన నీటిని, మీ కోరిక మేరకు మీ అడవిలోకి మళ్లించాం" అంది సింహం.

"నిజమే మిత్రమా! అయినా సమస్య అలానే ఉంది. అటుపక్క అడవిని పాలించే రాజు కూడా నీ మిత్రుడే కదా. వారినీ ఒప్పించి వాళ్లకు ఎక్కువైన నీటిని కూడా మా అడవికి మళ్లించేలా చేశావంటే మా సమస్య తీరుతుందేమో" అంది పులి.

"అసలు ముందు ఇంతటి నీటి సమస్య మీ అడవికే

ఎందుకొచ్చిందో నాకు అర్థం కావడం లేదు. రేపు నేను నీతోపాటు మీ అడవికి వచ్చి పరిశీలిస్తా. ఈ రోజుకు ఇక్కడే మా ఆతిథ్యం స్వీకరించు" అంది సింహం.

మరుసటి రోజు ఉదయమే అవి బయలు దేరాయి. సింహం తన అడవిని దాటి మిత్రుడైన పులి అడవిలోకి అడుగులు వేయగానే విషయం అర్థమైపోయింది. చెట్లన్నీ ఎండిపోయి ఉన్నాయి. చెరువులు అడుగంటి రాళ్ళ రప్పలతో దర్శనమిస్తున్నాయి. తన అడవి నుంచి పారిన నీరు కూడా ఈ అడవిలో నిలవడం లేదు. జంతువులన్నీ నీటి కోసం తపిస్తుండటం గమనించింది సింహం.

"మిత్రమా! చూశావు కదా... ఇది నా అడవి పరిస్థితి!" అంది పులి. పులి వెంట సింహం అడవంతా కలియ తిరిగింది. సమస్య పూర్తిగా అర్థమైంది. "మిత్రమా! ఇలా పక్క అడవుల నుంచి నీటిని తెప్పించుకున్నంత మాత్రాన నీ సమస్య తీరిపోదు. నీ అడవి కూడా ఇతర అడవులకు ఏ విషయంలోనూ తీసిపోదు" అంది సింహం. "అంటే నా అడవి కూడా సస్యశ్యామలంగా మారుతుందా...! ఎలానో చెప్పవా మిత్రమా!" ఆనందంగా అడిగింది పులి.

"అవును" అంటూ పులిని దగ్గరకు తీసుకున్నాడు మృగరాజు. "మిత్రమా! నువ్వు సమస్యకు తాత్కాలిక పరిష్కారం కోసమే చూస్తున్నావు, శాశ్వత పరిష్కారం గురించి ఆలోచించడం లేదు" అన్నాడు మృగరాజు.

పులి అర్థం కానట్లు సింహం వైపు చూసింది. "మిత్రమా! వర్షం వల్ల అ లభించిన నీరు మన అడవిలోనే నిల్చిపోవాలంటే... చెరువులో పూడిక తీయాలి. గట్లు పటిష్టం చేసుకోవాలి. అలాగే ఇంకుడు గుంతలు తవ్వుకోవాలి. అడవిలో కొత్తగా ఎప్పటికప్పుడు మొక్కలు నాటుకోవాలి. ఇవన్నీ మా అడవిలో చేయించాం కాబట్టే... ఎండల్లో కూడా పుష్కలంగా మాకు నీరు లభిస్తోంది" అన్నాడు మృగరాజు.

ఇదంతా విన్న పులి, సింహం సలహాలు, సూచనలు తప్పకుండా పాటించింది. అంతే.... కొద్ది రోజులకే పులి ఉండే అడవి కూడా పుష్కలంగా నీటితో కళకళలాడింది.

ఒక మంచిరోజు పులిరాజు, తన మిత్రుడు మృగ రాజుని ఆహ్వానించి "మిత్రమా! మన రూపాలు వేరైనా.. మన ఆత్మలు ఒక్కటే.. మన ఆశయాలూ ఒక్కటే! అడవిని నాకన్నా నీవే సమర్థవంతంగా పాలించగలవు. నా రాజ్యాన్ని నీకు కానుకగా యిస్తున్నాను. రెంటినీ నీవే పాలించు!" అంటూ పులిరాజు. తన మిత్రుడు మృగరాజుకు కానుకగా అందించాడు. (సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

శతకం


## వేమన పద్యాలు

**ఆత్మలోని శివుని నమవుగా శోధించి**
**నిశ్చలముగ భక్తి నిలిపెనేని**
**సర్వముక్తుడౌను సర్వంబుఁదానౌను**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : శరీరాన్ని, మనస్సును నిశ్చలంగా యోగసిద్ధిలో నిలిపినపుడు మాత్రమే ముక్తి లభిస్తుంది. అప్పుడు, అందరిలో తనను తనలో అందరినీ చూడగలడు.

**దీపంబు లేని యింటను**
**రూపంబును దెలియలేరు రూఢిగఁ దమలో**
**దీపమగు తెలివి గలిగియు**
**పాపంబుల మఱుగుత్రోవఁబడుదురు వేమా!**

తాత్పర్యం : దీపము యొక్క కాంతి చాలా దూరము ప్రసరించినట్లే సజ్జనుల ప్రభావము చాలా దూరము పోవును అది దుర్జనులను కూడా మార్చును..



కథ

# మన బాట




విద్యానగర్ అనే కాలనీలో (వీధి) సూర్య, అనిల్ అనే ఇద్దరు బీటెక్ చదివే కుర్రాళ్లు ఉన్నారు. అనిల్, సూర్య ఇద్దరు ఒకే కాలేజీకి వెళ్ళేవారు. వారిద్దరిల్లులు పక్క పక్కనే ఉండేవి. కాని అనిల్ ధనిక కుటుంబానికి చెందినవాడు. సూర్య వాళ్ళది మధ్యతరగతి కుటుంబం.

అనిల్ ధనిక కుటుంబానికి చెందినవాడు కాబట్టి అతని వద్ద ఖరీదైన టీ.వి, ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఐటాబ్ వుండేవి. తన తల్లిదండ్రులు బిజీ షెడ్యుల్ వలన అతని చదువు పట్ల ఎక్కువ ఏకాగ్రత చూపలేక పోయారు, అనిల్ ఏది కావాలంటే అది కొనిచ్చేవారు.


అనిల్ తన కాలేజీలో ఇతరులు బెట్టింగ్ యాప్స్ ఆడడం చూసి ప్రభావితుడైయ్యాడు. ఈ విషయం గురించి సూర్య కూడా కూడా తెలుసుకున్నాడు, కాని అది మంచి పని అనిపించలేదు, దాని గూరించి అతడు ఆలోచించలేదు.

అనిల్ మాత్రం ఇంటికి తిరిగి వచ్చాక బెట్టింగ్ యాప్స్‌తో చేరి అక్రమంగా డబ్బు సంపాదించడం మొదలు పెట్టాడు. ఒక నెల రోజుల పాటు బెట్టింగ్‌లో అనిల్ గెలిచి చాలా డబ్బు గెలిచాడు. ఆ డబ్బుతో చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. రోజులు గడిచిన కొద్ది అనిల్ బెట్టింగ్‌తో ఓడిపోతూ వచ్చాడు. డబ్బు చెల్లించేందుకు, తన తల్లిదండ్రుల దగ్గర నుండి దొంగలించే వాడు. ఈ విషయాన్ని వారి తల్లిదండ్రుల వద్ద దాచాడు.

ఒక రోజు పోలీసులు ఈ యాప్స్ పై నిఘా వేసుంచారు. అందులో అనిల్ ఇంకా చాలా మంది పేర్లు నమోదయ్యాయి. పోలీసులు అనిల్‌ను అరెస్ట్ చేసి జరిమానా విధించారు. అదే కాలేజీలో చదివే సూర్య, మాత్రం రోజు కాలేజ్ నుండి వచ్చి తన ఇంట్లో ఉండే ఫోన్లో ఆన్‌లైన్ యూట్యూబ్ క్లాసెస్ వినేవాడు, చివరికి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు.

ప్రతి అంశానికి రెండు ఫలితాలు వుంటాయి. మంచి, చెడు, అలాగే మనం కూడా టెక్నాలజీని మంచి కోసమే వాడాలి. బెట్టింగ్, సైలబుర్, మాఫింగ్ వంటివి ఆపాలి. ఏది మంచి, ఏది చెడు అని యువత గుర్తించి, మంచి బాటలో నడవాలి.

– జి.శ్రేష్ఠ
10వ తరగతి, విజయ్ ఉన్నత పాఠశాల, నిజామాబాద్
m : 7396651555




# తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు (AI) తో పిల్లలకు ఆధునిక విద్య

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలలో కృత్రిమ మేధస్సు (AI) వల్ల విద్యా రంగం కొత్త శకానికి అడుగు పెడుతోంది. ప్రపంచ స్థాయి నైపుణ్యాలను అందించే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్న విద్యా విధానాలను వేగంగా అమలు చేస్తోంది.

### సాంకేతికత ఆధారిత విద్యా శకం

ప్రాథమిక స్థాయి నుంచే కోడింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు విద్యను ప్రవేశపెడుతున్నారు. పిల్లలకు క్లిష్టమైన కాన్సెప్ట్స్ సులభంగా అర్థమయ్యేలా చర్యా ఆధారిత బోధన (activity-based learning) ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ద్వారా అధ్యాపక శక్తిని పెంచుతున్నారు. ప్రాథమికంగా కొన్ని పాఠశాలల్లో ప్రాయోగికంగా ప్రారంభించి, అక్టోబర్ నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అమలు చేయనుంది.

### AI ఆధారిత ఉచిత కోచింగ్ – పోటీ పరీక్షలకు సన్నద్ధత

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు AI ఆధారిత విద్యా EkStep Foundation, Physics Wallah, Khan Academy, Pi Jam Foundation వంటి NGO సంస్థలతో కలిసి విద్యార్థులకు ఉచితంగా ఆధునిక కోచింగ్ అందిస్తున్నారు.

### అందుబాటులో విద్యా విధానం:

ప్రాథమిక విద్య (తరగతులు 3–5), కోడింగ్ (తరగతులు 1–10), STEM వీడియోలు (తరగతులు 6–10), NEET, JEE, CLAT, UPSC, TGPSC లాంటి పోటీ పరీక్షలకు ఉచిత స్టడీ సర్కిల్ సెంటర్‌లను అందుబాటు లోకి ప్రభుత్వం తీసుకొచ్చింది.

### ఆధునిక హాజరు పద్ధతి – Facial Recognition

విద్యార్థుల హాజరు నమోదులో ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ తప్పనిసరిగా ప్రవేశపెట్టబడింది. హాజరు సెకన్లలో నమోదయ్యి, రియల్ టైమ్‌లో డేటా అప్డేట్ అవుతుంది. ఇప్పటికే రాష్ట్రంలో 430కి పైగా జూనియర్ కళాశాలల్లో ఈ పద్ధతి అమలులో ఉంది.

### ముగింపు

ఈ టెక్నాలజీ ఆధారిత విధానాల ద్వారా తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ సంస్థలకంటే ముందుగా, విద్యార్థులకు ఆధునిక వైపు తలుపులు తెరుస్తున్నాయి. ప్రభుత్వ నూతన చర్యలు పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

– లత
e: ogshydcbse@gmail.com








## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# తెలంగాణలో బౌద్ధం తొలి అడుగులు...

ప్రపంచ దేశాల్లోనూ, ముఖ్యంగా భారత దేశంలో క్రీ.పూ. ఆరవ శతాబ్దం కొత్త మతాలకు విప్లవాత్మక మార్పులకు వేదికగా పేర్కొనవచ్చును. ఆసియా దేశాల్లో నేటికీ బౌద్ధం ప్రధాన మతంగా కొనసాగటాన్ని 'లైట్ ఆఫ్ ఆసియా' (బుద్ధుడు) ఆవిర్భవించింది మన వద్దనే అని గర్వంగా చెప్పుకొంటాం. బౌద్ధం ప్రాచీన భారతదేశంపై పురుడు పోసుకునే నాటికి ఎన్నో మత శాఖలు అప్పటికీ ఉండేవి. బౌద్ధ మత స్థాపన మగధలో జరిగినా పరిపూర్ణ అభివృద్ధి కోసలలో జరిగింది. ఈ మతాన్ని గౌతమ బుద్ధుడు స్థాపించాడు. బుద్ధుని జీవిత చరిత్ర జాతక కథలు, సుత్తనిపాత, దీపవంశ, మహావంశ అనే సింహళ బౌద్ధ గ్రంథాలు, బౌద్ధమత మూల గ్రంథాలైన త్రిపీఠకాలు, మహావస్తు, లలిత విస్తరం, బుద్ధచరితం, దీఘనికాయ, అభినిష్క్రమణ, నిదనకథ, సూత్ర ప్రామాణిక గ్రంథాలుగా పరిగణిస్తారు.

భారత ఉపఖండంలో భాగమైన తెలంగాణాలో బౌద్ధం ఒక ప్రధాన మతంగా ఉండేది. అస్సక మహాజన పదంగా రూపొంది శాతవాహన పూర్వపు రాజులు, శాతవాహన, ఇక్ష్వాకు, వాకాటకులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, కాకతీయుల వరకు కూడా బౌద్ధ మతం ప్రజా జీవితంతో పెనవేసుక పోయిందనటానికి సాహిత్య, శాసన, పురావస్తు ఆధారాలు గోదావరి తీరం నుండి, కృష్ణానదీ తీరం వరకు అనేక నదీ తీర గ్రామాల్లో నేటికి లభిస్తూనే ఉన్నాయి.


సుమారు 2500 సంవత్సరాలకు పూర్వమే తన శాంతి ప్రబోధాన్ని అందించి గౌతమ బుద్ధుడు ప్రపంచాన్ని ప్రభావితం చేశాడు. క్రీ.పూ. 6వ శతాబ్దంలోనే బుద్ధుని ఆలోచనలు, శాంతి మార్గం తెలంగాణలో ఆచరణలో వచ్చాయంటే అప్పటి అస్మక జనపదంలో ఉన్న నేలలోని మానవ మేధస్సు ఎంత గొప్పగా ఆలోచించిందో మనకు ఆశ్చర్యం అనిపించవచ్చు. కాని అది నిజం. నాటి అస్సక జనపదంలోని గోదావరి తీరంలో భావరి అనే ఋషి తన శిష్యులతో నివాసాన్నేర్పరచుకొని నివసించాడని సుత్తనిపాత అనే గ్రంథం మనకు చెబుతుంది.

బుద్ధుని త్రిపీఠకాల్లో భాగమైన సుత్తనిపాతలో గోదావరి నది రెండుగా చీలి మళ్ళీ కలిసిన ద్వీపంలో బావరి అనే ఋషి కోసల ప్రాంతం నుండి వచ్చి నివాసముండేవాడని ఉంది. అతని వద్దకు మరో బ్రాహ్మడు వచ్చి 500 నాణాలు ఇవ్వమని అడగడం ఇవ్వకపోతే తల ముక్కలై మరణిస్తావని శపించడం జరుగుతుంది. దుఃఖంలో ఉన్న బావరికి ఒక స్త్రీ దేవత జ్ఞానోదయమైన ఒక మహా పురుషుడు ఉత్తరాపథంలో ఉన్నాడని తాను నీకు మార్గం చూపుతాడని కలలో చెప్పడం జరుగుతుంది. వయోభారంతో తాను వెళ్ళలేక తన శిష్యులైన అజిత, తిస్స, పున్నక, మెత్తయ్య, మొదుగ, ఉపశివ, నంద, దొతక, హేమక, తోదయ్య, కప్పాజాతు, ఉదయ, భద్రాప్రద, పోసల, మొగరాజు, పింగియలను బుద్ధుని వద్ద తన సంశయాలను తీర్చుకొని రావాలని పంపడం జరిగింది. వీరు అక్కడి నుండి ములకలోని పటిత్తాన్ (మహారాష్ట్ర పైఠాన్), మహిస్సతి (మధ్యప్రదేశ్ మహిష్మతి), ఉజ్జేని ( ఉజ్జయనీ), గోనార్ధ, విదిష, కోశాంబి, సాకేత నేటి అయోధ్య (ఉత్తరప్రదేశ్), సెతయేవ, కపిలవస్తు, (నేపాల్ దిగువ ప్రాంతం), కుసినార (కుశీనగరం), పావ (పావపురి), వేసాలి (వైశాలి), మగధంపుర (పాట్నా), చివరకు రాజగృహ (బీహార్‌లోని రాజ్‌గిర్)లో తథాగతున్ని కలుసుకున్నట్లు స్పష్టంగా సుత్తనిపాతలో పేర్కొనబడింది. బుద్ధుని కలిసిన ప్రదేశం పాశానక చితియగా పేర్కొన్నారు. వారి సంశయాలను తీర్చుకొని 16 మంది బుద్ధుని శిష్యులైనారు. 15 మంది శిష్యులు అక్కడే ఉండగా పింగిమ బావరి మేనల్లుడు తిరిగి బావరి వద్దకు వచ్చి బుద్ధుని శాంతి సందేశాన్ని అందించడంతో బావరికి బుద్ధుడు ఒక వెలుగు వలె కన్పించి ఉపశమనం పొందాడని తాను బౌద్ధం తీసుకోవడంతో బుద్ధుని జీవిత కాలంలో ఈ తెలుగు నేలకు బౌద్ధం వచ్చిందని తెలుస్తుంది. తదనంతరం బోధన్ రాజధానిగా పాలిస్తున్న అస్మక రాజు కూడా బౌద్ధం తీసుకున్నాడని నేటికి గోదావరి తీరానికి రెండు వైపులా ఉన్న గ్రామాలకు బావరి శిష్యుల పేర్లు, అలాగే బుద్ధుని, ధర్మ అనే పేర్లతో ఉన్న గ్రామాలు ఈ సుత్తనిపాతలోని వృత్తాంతాన్ని ఋజువు చేస్తున్నాయి.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

సైన్సు

# నీటి మీద గుండు సూది



నీళ్లకన్నా బరువైన వస్తువులు నీళ్లల్లో వేస్తే మునిగిపోతాయనీ, తేలికైన వస్తువులు తేలతాయనీ అందరికీ తెలుసు. దీనినే శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే – నీటికన్న ఎక్కువ సాంద్రత (Density) గల వస్తువులు నీటిలో మునిగిపోతాయి. తక్కువ సాంద్రత గల వస్తువులు తేలతాయి. ఈ సంగతి చదువూ సంధ్యాలేని ఆదిమ మానవులకు కూడా తెలుసు.

నీళ్లకన్నా గుండుసూది బరువు ఎక్కువ. దానిని నీళ్లల్లో వేస్తే బుడుంగున మునిగిపోతుంది. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. కాని, అదే గుండుసూదిని నీళ్ల మీద తేలేటట్లు చేసే గారడీ ఒకటి ఉంది.

కప్పులో మూడు వంతులు నీళ్లు పోసి బల్ల మీద పెట్టు. పాత దినపత్రిక నుంచి గుండుసూది కన్నా కాస్త పెద్ద ముక్క చింపి, ఆ నీళ్లల్లో వెయ్యి. అది నీళ్లు పీల్చుకుంటుంది. కానీ వెంటనే మునిగిపోదు. తేలుతున్న ఆ కాగితం ముక్క మీద నెమ్మదిగా గుండుసూదిని జారవిడు. నువ్వు చెయ్యవలసిన పని అంతే.

కొద్ది సేపట్లోనే కాగితం ముక్క నీళ్లల్లో మునిగి పోతుంది. గుండుసూది మాత్రం నీళ్ల మీద తేలుతు ఉండిపోతుంది! (కాగితం ముక్క నీళ్లల్లో త్వరగా మునగకపోతే, గుండుసూదికి తగలకుండా మూడు నాలుగు నీటి చుక్కలు వేలితో కాగితం మీద వదలాలి.)

ఈ గమత్తు సజావుగా జరగాలంటే గుండుసూది పొడిగా ఉండాలి. నీళ్లు నిశ్చలంగా ఉండాలి. కప్పు, నీళ్లు, సూది జిడ్డు లేకుండా ఉండాలి. గడ్డం చేసుకునే బ్లేడు అయితే ఇంతకన్నా తేలికగా నీటి మీద తేలుతుంది. కాగితం అవసరం లేకుండా సరాసరి నీళ్ల మీదనే నెమ్మదిగా జారవిడిస్తే తేలుతుంది. గుండుసూది నీళ్ల మీద తేలుతూ ఉండగా ఆ నీళ్లల్లో ఒక్క నూనె బొట్టు వేసినా, చిన్న సబ్బు ముక్క వేసినా, ఆ గుండుసూది మునిగిపోతుంది.

ఇంతకీ నీళ్లకన్నా బరువైన గుండుసూది నీళ్ల మీద తేలడం ఎలా సాధ్యమైంది? ద్రవపదార్థాల ఉపరితలాల మీద ఒక విధమైన "బిగింపు" కనిపిస్తుంది. దీనిని "తలతన్యత" అంటారు. ఉపరితలం మీదనున్న ద్రవం తాలూకు అణువులు ద్రవాన్ని విడిచి పైకి పారిపోకుండా ఈ బిగింపు అడ్డుపడుతుంది. అందువల్ల ద్రవాల ఉపరితలాల మీద బలమైన అణువుల పొర – కనిపించని సాగతీసిన రబ్బరు పొర పరిచారా అన్నట్లు – ఏర్పడుతుంది. ఈ కనిపించని పొరకి ఉండే బలం ద్రవాన్ని బట్టి ఉంటుంది. నీటి మీద గుండుసూది తేలేలా చేసింది ఈ బలమే.

జాగ్రత్తగా గమనిస్తే తేలుతున్న గుండుసూది చుట్టూ నీటి మట్టం ఎత్తుగానూ, సూది ఆనుకున్న చోట మాత్రం మట్టం కాస్త పల్లంగానూ కనిపిస్తుంది. సూది బరువు వల్ల నీటి పొర కాస్త కిందికి దిగినట్లుగా ఉంటుంది. సూది బరువు మరీ ఎక్కువైతే ఈ పొర "చిరిగిపోయి" సూది మునిగి పోతుంది. సూదిని నిట్టనిలువుగా నీళ్లల్లో వదిలితే మునిగి పోతుంది. సూది మొన అనుకున్నంత మేరలో ఉన్న నీటిలో పొరకి మొత్తం గుండుసూదిని మోయగల బలం లేకపోవటమే దీనికి కారణం.

నూనె చుక్కగానీ, సబ్బు ముక్కగానీ వేస్తే నీటి తలతన్యత తగ్గిపోతుంది. ఇది సూదిని మోయడానికి సరిపోదు. కాబట్టి సూది మునిగిపోతుంది.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి




# దివ్వెల కేళి దీపావళి

తాతయ్య: తేజ! ఏమిటి సీరియస్‌గా చదివేస్తున్నావ్? పరీక్షలా? ఏమిటి?

తేజ: పరీక్షలు ఏమి కాదు తాతయ్య ఈ "దీపావళి బాణా సంచా – అవసరాలు ప్రమాదాలు" అనే అంశం గురించి మా సైన్స్ టీచర్ ఒక చిన్న 'ప్రాజెక్ట్' ఇచ్చారు. దాని గురించే ఈ తిప్పలు. మీకు తెలిస్తే ఎలా రాయాలో చెప్పవచ్చు కదా?

తాత: ఎలా వ్రాయాలో చెప్పడం. వ్రాసిపెట్టడం నా వల్ల కాదు గాని దాని వెనక కారణాలు చెప్పమంటే చెబుతాను.

తేజ: అసలు ఈ దీపావళి పండుగకు బాణాసంచాకు గల సంబంధం చెప్పడానికి ముందు అసలు పండగ ఎందుకు చేస్తున్నారో చెప్పవా?

తాత: ఇది అసలు ప్రశ్న (నవ్వుతూ) ఈ పండుగను మన దేశమంతటా చేసుకుంటారు. దక్షిణ భారతంలో మూడు రోజులు చేసుకుంటాము. ఉత్తర భారతంలో ఐదు రోజులు చేసుకుంటారు.

తేజ: మాకు మాత్రం ఒక్క రోజే సెలవు ఇస్తారు.

తాత: పండుగలు అంటే కేవలం సెలవు రోజులు మాత్రమే కాదని నీకు చాలా సార్లు చెప్పాను.

తేజ: ఓ... సారీ!! ఇంకెప్పుడు అలా అనునులే! ఇంతకీ పండగ నేపథ్యం ఏంటో చెప్పవా?!

తాత: ఈ పండుగ నేపథ్యంకు మన ఇతిహాసాల్లో చాలా కథలున్నాయి. భారతంలో నరకాసురవధ భాగవతంలో బలిచక్రవర్తి కథ రామాయణంలో కూడా రావణవధ వంటి గాథలను చెబుతారు. అలాగే జైనుల గురువు మహావీరుడు చనిపోయిన రోజుగా భావించి పండగ చేసుకుంటారు.

తేజ: ఇంతకీ ఈ పండుగ కూడా తెలుగు నెల ప్రకారమే వస్తుంది కదా?!

తాత: అవును ఇది రెండు తెలుగు నెలల మధ్య వచ్చే గొప్ప పండగ.

తేజ: అదెలా తాతయ్యా?!

తాత: ఇది ఆశ్వయుజ మాసం చివరి రెండు రోజులు కార్తీకమాసం మొదటి మూడు రోజులు కలిపి మొత్తం ఐదు రోజులు చేసుకుంటారు.

తేజ: భలేగా వుందే! ముందు పండగ నేపథ్యం చెప్పి తర్వాత ఎలా చేస్తారో చెబుదువు గాని.

తాత: అలాగే! వినుమరి. ఈ దీపావళి పండగ చేసుకోవడానికి ప్రధాన కారణంగా చెప్పే కథ నరకాసురవధ. భారతం జరిగిన కాలంలో ఆదివరాహమూర్తికి భూదేవికి నరకాసురుడు జన్మించాడు. అతనికి తల్లి చేతులో తప్ప ఎవరి చేతుల్లో మరణించడు అనే వరం ఉంది. ఆ గర్వంతో అందరినీ అనేక ఇబ్బందులు అవమానాలు పెడుతూ నానా భీభత్సం చేస్తుండగా దేవతలు, ఋషులు అతని ఆగడాలు తట్టుకోలేక విష్ణుమూర్తి అంశ అయిన కృష్ణుడితో నరకుడి బాధలు గురించి మొర పెట్టుకోగా తన దివ్యదృష్టితో విషయం తెలుసుకున్న కృష్ణుడు భూదేవి అంశ అయిన తన సతి సత్యభామతో కలిసి నరకుడి రాజధానికి బయలు దేరతాడు.

తేజ: అతడి రాజధాని ఎక్కడ వుంది తాత?

తాత: ప్రాగ్జ్యోతిష్యపురం, ఇది ప్రస్తుతం అస్సాం రాష్ట్రంలోని గౌహతి ప్రాంతం. అక్కడకు చేరిన శ్రీకృష్ణుడు నరకాసురిడితో భీకరమైన పోరు చేస్తాడు.

తేజ: శ్రీకృష్ణుడు నరకుడిని ఓడించి సంహరించాడా?!

తాత: లేదు అతనికి తల్లిచేతిలో తప్ప ఎవరి చేతిలో మరణించే యోగం లేదు కదా? అందుకే అలసిపోయినట్లు నటించి రథం మీద పడిపోయాడు శ్రీకృష్ణుడు.

తేజ: అయ్యో మరి నరకుడు ఏమి చేసాడు? కృష్ణుడిని వదిలేసాడా?

తాత: అలా వదిలేస్తే నరకుడి రాక్షస బుద్ధి ఎక్కడికి పోతుంది?! అలసిపోయిన కృష్ణుడి మీద కూడా బాణాలు వేయబోతుంటే నరకుడి తల్లి అంశ అయిన సత్యభామ తన భర్త ప్రాణాలు రక్షించుకునే ప్రయత్నంతో కృష్ణుడి చేతిలో ధనుస్సు బాణం తీసుకుని ఆవేశంతో ఒకే బాణంతో నరకుడిని చంపేస్తుంది.

తేజ: అమ్మో...! కృష్ణుడికి బలమే కాదు తెలివి జాస్తి అన్న మాట.

తాత: అంతే కదా మరి. అలా లోక కంఠకుడైన నరకాసురుడు సంహరించబడిన "ఆశ్వీయుజ కృష్ణపక్ష చతుర్దశి"ని నరక చతుర్ధశి గాను ఆ మర్నాడు అమావాస్య రోజు నరకుని బాధలు పోయిన ఆనందంతో దీపాలు వెలిగించి దీపావళి పండుగ జరుపుకోవడం ఆనవాయితిగా వచ్చింది.

తేజ: ఈ పండుగకే మరో కథ కూడా వుంది అన్నావు కదా?! అది ఏమిటి తాతయ్య!

తాత: రాక్షసుల రాజు అయిన బలి చక్రవర్తి గొప్ప దానశీలి కాని నేనే గొప్పదాన గుణం కలవాడిని అనే గర్వంతో ఎవ్వరిని లెక్క చేసేవాడు కాదు. అతనికి బుద్ధి చెప్పాలనే నేపంతో విష్ణుమూర్తి వామన అవతారంలో బలిచక్రవర్తి వద్దకు వెళ్లి మూడు అడుగుల నేల దానం అడగగా పొట్టి వామనుడి కోరిక తీర్చడానికి బలి ముందుకు వస్తాడు. వామనుడు ఒక్కసారిగా తన శరీరాన్ని పెంచి ఒక అడుగు నేల మీద మరో అడుగు ఆకాశం మీద మోపి మూడో అడుగు ఎక్కడ పెట్టాలని బలిని అడగంగా అవకాశం లేదు ఆ వామనుడి మూడో పాదాన్ని తన శిరస్సు మీద పెట్టమంటాడు. వెంటనే వామన రూపంలోని విష్ణువు బలి చక్రవర్తి తల మీద పాదం మోపి పాతాళానికి తొక్కి అతని అహంకారం తొలగించి అతనిలో పరివర్తన కలిగించిన సందర్భంగా ప్రజలు నరక చతుర్ధశి అనే దీపావళి పండగ చేసుకుంటున్నారు అని ఒక కథనం ఉంది.

తేజ: కారణాలు, కథలు ఏవైనా కష్టాలు తొలిగిన ఆనందంతో జరుపుకనేదే ఈ దీపావళి పండుగ కదా తాతయ్యా?!

తాత: బాగా అర్థం చేసుకున్నావ్! అలాగే రామాయణ కాలంలో రాముడు రావణుడిని వధించి అయోధ్యలో భరతుడిని కలుసుకున్న ఆనందంతో అక్కడి ప్రజలంతా దీపాలు వెలిగించి పండగ చేసుకున్నట్లు ఒక కథనం ఉంది. అదే విధంగా విక్రమార్కుడి పట్టాభిషేకం జరిగిన రోజుగాను మహావీరుడి నిర్యాణం సందర్భంగాను ఈ పండగ చేసుకుంటారు అనే కథనాలున్నాయి.

తేజ: మరి ఐదు రోజులు చేస్తారు అన్నావ్‌గా ఎలా?!

తాత: మొదటి రోజు ధనత్రయోదశి ఆ రోజు ప్రదోష కాలంలో ఇంటి ముందు దీపం వెలిగించి 'యమ దీపం"గా పూజిస్తారు. దానివల్ల అనుకోని మృత్యు గండాలు తొలగిపోతాయని నమ్మకం. రెండవ రోజు నరక చతుర్ధశి సూర్యోదయానికి ముందే లేచి తల స్నానం చేసి నువ్వులు దానంగా ఇస్తారు. ఈ రోజు సాయంత్రం పెట్టే దీపాలను "బలి దీపాలు" అంటారు. ఇక మూడవ రోజు ముఖ్యమైనది దీపావళి పండుగ" అమావాస్య రోజున సాయంత్రం లక్ష్మీదేవిని శాస్త్రోక్తంగా పూజిస్తారు. ఇంటిలో బయట అధికంగా దీపాలు వెలిగిస్తారు. ఇక నాల్గవ రోజు కార్తీక మాసం పాడ్యమి. దీనినే "బలి పాడ్యమి" అని పాతాళానికి తొక్కబడ్డ బలి తిరిగి భూలోక సంచారం కోసం ఈ రోజు వస్తాడని నమ్ముతారు. చివరి రోజు విదియ దీనినే "భాతృ విదియ" అంటారు. ఈ రోజు సోదరులు సోదరి చేసిన వంట తినాలని తద్వార మృత్యు భయం రాదని యమధర్మ రాజు తన చెల్లి యమున చేతి వంట తినడం. దీనినే "భగినీ హస్త భోజనం" అంటారు.

తేజ: మరి నువ్వ చెప్పిన దానిలో దీపాలు తప్ప ఎక్కడ దీపావళి బాణాసంచా బాంబుల గోలా ఎక్కడా లేదుగా?!

తాత: వానాకాలం పోయి శీతాకాలం వస్తున్న వేళ వచ్చే ఈ పండుగ వేళల్లో నేలంతా తేమగా ఉండి దోమలు క్రిమి కీటకాలు పెరిగిపోతాయి, బాణాసంచా కాల్చడం వల్ల వచ్చే పొగ, రసాయనాలకు ఆ క్రిమి కీటకాలు నశించి మంచి వాతావరణం ఏర్పడుతుంది.. తెలుసా?

తేజ: ఓహో!! అయితే దీపావళి బాణాసంచాలో.. గోలతో పాటు ఇన్ని లాభాలు కూడా ఉన్నాయా?? రైట్ తాతయ్య థాంక్యూ ఉంటాను బాయ్...!


– డా. అమ్మిన శ్రీనివాసరాజు
m : 7729883223

# నోబెల్ బహుమతులు పొందిన ఏడుగురు జె.జె.థామ్సన్ శిష్యులు

1906లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన జె.జె. థామ్సన్ ఎలక్ట్రాన్ ఆవిష్కర్త అని చదువుకుంటాం. 1856 డిసెంబర్ 18 జన్మించిన ఈ బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త క్యాథోడ్ కిరణాలను అధ్యయనం చేయడం ద్వారా ఋణాత్మక ఆవేశం ఉన్న సబ్ అటామిక్ పార్టికల్ అయిన ఎలక్ట్రాన్ గురించి తొలిసారి తెలియజేశారు. అంత వరకు తెలియని ఋణాత్మక ఆవేశమున్న క్యాథోడ్ కిరణాల గురించి 1897లో తొలిసారి తెలియజేసిన వారు జే.జే.థామ్సన్. ఫిజిక్స్ మీద ఆసక్తి ఉన్న వైద్యుడు జి.ఈ.పేజిట్ కుమార్తె రోజ్ ఎలిజిబెత్‌ను 1890లో వివాహం చేసుకున్నారు. థామ్సన్ ప్రసంగాలు విని ఆసక్తి, అభిమానం వివాహంగా మారిన సందర్భం ఈమెది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు జి.పి. థామ్సన్, జె.పి. థామ్సన్. పెద్ద కుమారుడు జార్జ్ థామ్సన్ ఎలక్ట్రాన్ తరంగ ప్రవృత్తి గురించి చేసిన పరిశోధనకు 1937లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. రెండవ కుమారుడు జాన్ థామ్సన్‌ను చార్నోక్ అని కూడా అంటారు. ఈయన పిల్లల పుస్తకాలు, నాన్ ఫిక్షన్, జీవిత చరిత్రలు రాసిన రచయిత.

జేజే థామ్సన్ తండ్రి జోసెఫ్ జాన్ థామ్సన్ తాతలనాటి పుస్తకాల కొట్టును నిర్వహించేవాడు. థామ్సన్ మాన్చెస్టర్‌లో చదివే కాలంలో 14 ఏళ్ల వయసులో ఫిజిక్స్ టీచర్ ప్రభావానికి లోనై ఆ సబ్జెక్టు మీద ఆసక్తి పెంచుకున్నారు. అనతి కాలంలోనే పరిశోధనా పత్రాన్ని కూడా వెలువరించారు. అయితే తండ్రి 1873లో అకాల మరణం చెందడంతో ఈ ప్రణాళికలు దెబ్బ తిన్నాయి. 1876లో కేంబ్రిడ్జ్ ట్రినిటీ కాలేజీలో చేరి, మూడేళ్ల తర్వాత గణిత శాస్త్రంలో బి.ఏ. పొందారు. 1883లో ఆడమ్స్ బహుమతి పొందుతూ ఎం.ఏ. పట్టాను కూడా గడించారు. 1884లో కేంద్రంలో భౌతిక శాస్త్రం ప్రొఫెసర్‌గా నియమించబడ్డారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గణిత శాస్త్రంలో అత్యంత ప్రతిభ నైపుణ్యం ఉన్న వీరిని భౌతిక శాస్త్రంలో ప్రొఫెసర్‌గా ఎంపిక చేయడం. 1914లో ఆయన అటామిక్ థియరీ ప్రతిపాదించారు. 1918లో కేంబ్రిడ్జ్ ట్రినిటీ కళాశాలలో మాస్టర్ స్థాయిలో నియమించబడి చివరిదాకా, అందులోనే కొనసాగారు. 1940 ఆగస్టు 30న జె.జె. థామ్సన్ కనుమూసినప్పుడు ఆయన చితి భస్మం ఐజాక్ న్యూటన్, ఆయన విద్యార్థి ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ గార్లతో పాటు వెస్ట్ మినిస్టర్ అబే స్మృతి వనంలో పదిలపరిచారు. జే.జే. థామ్సన్ చాలా అద్భుతమైన ఉపాధ్యాయులు, ఆయన శిష్యులు ఏడుగురికి నోబెల్ బహుమతి రావడం విశేషం.

## నోబెల్ బహుమతులు పొందిన శిష్యులు



**1. ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (Ernest Rutherford 1871-1937):** న్యూజిలాండ్‌కు చెందిన భౌతిక, రసాయన శాస్త్రాల దిట్ట అయిన రూథర్‌ఫోర్డ్ అటామిక్ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్ సంబంధించి చాలా గట్టి కృషి చేశారు. ప్రయోగాలు చేయడంలో మైకేల్ ఫారడే అంతటి ఖ్యాతి పొందిన వీరిని 'న్యూక్లియర్ ఫిజిక్స్ పిత' గా గౌరవిస్తారు. వీరికి రసాయన శాస్త్రంలో 1908లో నోబెల్ బహుమతి లభించింది.



**2. విలియం లారెన్స్ బ్రాగ్ (William Lawrence Bragg 1890-1971):** వీరి తండ్రి విలియం హెన్రీ బ్రాగ్ కూడా గొప్ప శాస్త్రవేత్త. ఈ తండ్రి కొడుకులు ఇద్దరు ఎక్స్ కిరణాలు ఉపయోగించి స్ఫటిక నిర్మాణం వివరించారని 1915లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఈ పరిశోధన తర్వాతనే 'ఎక్స్రే క్రిస్టలోగ్రఫీ'

(X-Ray Cristalligraphy) అనే ఫిజిక్స్ విభాగం వృద్ధి చెందింది. ఈ నోబెల్ బహుమతి లభించినప్పుడు విలియం లారెన్స్ బ్రాగ్‌కు కేవలం పాతిక సంవత్సరాలే.




**3. చార్లెస్ బర్క్‌లా (Charles Barkla 1877–1944):** ఎక్స్ కిరణాల ధర్మాలను వివరించినందులగాను ఈ బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్తకు 1917లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈ బహుమతి లభించినప్పుడు ఈయనకు వయసు 30 సంవత్సరాలు మాత్రమే.



**4. ఫ్రాన్సిస్ విలియం ఆస్టన్ (Francis William Aston 1877– 1945 ):** భౌతిక రసాయన శాస్త్రాలలో నిష్ణాతులైన ఈ బ్రిటిష్ శాస్త్రవేత్తకు 1922లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. మాస్ స్పెక్ట్రోగ్రాఫ్ సహాయంతో రేడియోధార్మికత లేని ఎన్నో మూలకాలకు ఐసోటోపులను వీరు కనుక్కున్నారు.



**5. చార్లెస్ థామ్సన్ రీస్ విల్సన్ (Charles Thomson Rees Wilson 1869-1959):** బ్రిటన్‌కు చెందిన వాతావరణ శాస్త్రం, భౌతిక శాస్త్రాలకు చెందిన ఈ శాస్త్రవేత్తకు 1927లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. క్లౌడ్ ఛైమ్బర్ (Cloud chamber) రూపొందించినందుకు వీరితోపాటు ఆర్థర్ కామ్టన్ (Arthur Compton) నోబెల్ బహుమతిని పంచుకున్నారు.



**6. ఓవెన్ రిచర్డ్‌సన్ (Owen Richardson 1879-1959):** తర్వాతి కాలంలో 'థర్మియానిక్ ఎమిషన్' (Thermionic emission) గా ప్రసిద్ధి చెందిన పరిశోధనలు చేసిన రిచర్డ్‌సన్ ప్రతిపాదించిన సూత్రం అతని పేరు మీదనే ఇప్పుడు కూడా చలామణిలో ఉంది. దీనికే వీరికి 1928లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.



**7. ఎడ్వర్డ్ ఆపిల్టన్ (Edward Victor Appleton 1892-1965):** వాతావరణానికి సంబంధించిన పరిశోధనలు చేసిన ఈ భౌతిక శాస్త్రవేత్త 1947లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. వాతావరణంలోని పై తలాలకు సంబంధించి వీరు పరిశోధన నోబెల్ బహుమతిని పొందింది. అంతే కాకుండా, వాతావరణంలోని ఆ తలాన్ని 'ఆపిల్టన్ లేయర్' అని కూడా అంటారు.


**– డా. నాగసూరి వేణుగోపాల్**

ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392


## మన శరీరమే ఒక క్యాబినెట్

| | | |
|---|---|---|
| మెదడు | - | ప్రధానమంత్రి |
| ఊపిరితిత్తులు | - | హోంశాఖ |
| తల | - | విద్యాశాఖ |
| చెవి | - | కమ్యూనికేషన్ |
| కడుపు | - | ఆహార, వ్యవసాయ |
| గుండె | - | ఆర్థిక |
| పాదాలు | - | రవాణా |
| ముఖం | - | ఆరోగ్య |
| కళ్లు | - | న్యాయ |
| చర్మం | - | రక్షణ |

చెట్టు - చేమ


# నిమ్మ చెట్టు




హాయ్ బాలలూ! ఎలా ఉన్నారు? బాగున్నారా! గణేష్ పండుగ గురుపూజోత్సవం ఘనంగా చేసుకున్నాం కదా! బతుకమ్మ, దసరా పండుగ కూడా బాగా చేసుకుందాం. జమ్మితో అలాయ్-బలాయి తీసుకుందాం. మనం ఈ అక్టోబర్ నెల 'బాల చెలిమి" సంచికలో చెట్టు-చేమ శీర్షికన అమ్మ వంటి "నిమ్మ చెట్టు" గురించి తెలుసుకుందాం. సరేనా!

నిమ్మ చెట్టు 10-18 మీటర్ల ఎత్తులో గుబురు చెట్టులా పెరుగుతుంది. దీనికి పదునైన ముళ్ళు ఉంటాయి. మన ఇండ్లలో అనేక చెట్లతో పాటు నిమ్మ చెట్లను కూడా పెంచుకోవడం సహజం. నిమ్మ చెట్టు ముదురు ఆకుపచ్చ రంగులో రెండు ఇంచుల వెడల్పుతో ఆకులు కలిగి ఉంటుంది. చెట్టుకు ఎన్ని ఆకులు ఉంటాయో దాదాపు అందులో సగం నిమ్మ కాయలు చెట్టు కాస్తుంది. ఇటీవల కాలంలో రైతులు నిమ్మ తోటల సాగు విస్తారంగా చేస్తున్నారు. నిమ్మ నిత్య ఆదాయ వనరు కలిగిన చెట్టు. ఎండాకాలంలో నిమ్మకాయల ధర అధికంగా ఉంటుంది. నిమ్మ చెట్టుకు ఎండిన కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ఏదైనా తెగులు తగిలితే వెంటనే మందులు కొట్టాలి. నిమ్మ కాయలు సంవత్సరం పొడవునా మార్కెట్లో లభిస్తాయి. ఇమ్యూనిటీ కోసం నిమ్మకాయలు ప్రతి వ్యక్తి ప్రతి ఇంటిలో వాడుతారు. నాటిన రెండు లేదా మూడు సంవత్సరాల నుండే నిమ్మచెట్టు కాయలు కాస్తుంది. నిమ్మచెట్టు సంవత్సరానికి రెండు లేదా ఒక్కొక్కసారి మూడు దఫాలుగా కాయలు కాస్తుంది. నిమ్మ చెట్టును ఇంగ్లీషులో "Neem Tree" అని పిలుస్తారు. నిమ్మకాయలతో ఊరగాయ పచ్చడి పెడతారు. చాలా రుచిగా ఉంటుంది. ఎండాకాలంలో ఈ పచ్చడి తినడం వల్ల ఆరోగ్యానికి చల్లదనం చేకూరుతుంది. నిమ్మకాయలను రోజువారి ఆహారంగా తీసుకుంటారు. ఉదయం లేవగానే గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ రసాన్ని పిండి తాగుతారు. జీర్ణశక్తి సులభంగా కావడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మంచిది. నిమ్మలో "సి" విటమిన్ పుష్కలంగా లభిస్తుంది. పులిహోర అన్నంలో నిమ్మ రసాన్ని పిండి తింటే భలే కమ్మగా ఉంటుంది. నిమ్మ కాయలు, నిమ్మ పండ్లు మానవాళికి సర్వరోగ నివారిణిగా పని చేస్తాయి. నిమ్మకాయలు ఆకుపచ్చ రంగులోను, పండ్లు పసుపు రంగులోనూ ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అంతులేని విటమిన్లు అనేక ప్రయోజనాలు నిమ్మ కాయలలో లభిస్తాయి. నిమ్మకాయ శాస్త్రీయ నామం "సిట్రస్ లిమోన్". ఇది సిట్రస్ జాతికి చెందినది. ఆరోగ్యవంతమైన నిమ్మచెట్టు ప్రతి క్రాప్‌లో సుమారు రెండు వేల నుండి 4 వేల దాకా కాయలు కాస్తుంది. నిమ్మ చెట్టు జీవితకాలం 30 నుండి 40 సంవత్సరాలు ఉంటుంది. ఎర్ర భూముల్లో బాగా పెరుగుతాయి. నిమ్మ చెట్లు సతతహరితంగా ఉంటాయి. ఏడాది పొడవునా కాయలు, పండ్లు ఇస్తాయి. నిమ్మకాయలకు అన్ని సీజన్లో బాగా గిరాకీ ఉండి డిమాండ్ ఉన్న ఆహార పంట. నిమ్మ చెట్లు వెచ్చని ఉష్ణ మండల వాతావరణంలో బాగా పెరుగుతాయి. చెట్లు బాగా పెరగాలంటే సూర్య రష్మి చాలా అవసరం. వేడి నీటిలో నిమ్మ రసం కలుపుకొని తాగడం వల్ల శరీర బరువు తగ్గుతుంది. మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడకుండ నిరోధిస్తుంది. నిమ్మకాయ నీరు త్రాగడం అలసటను తగ్గిస్తుంది. నిమ్మకాయలు ఆహారంలో వాడడం ద్వారా గుండె జబ్బులను తగించుకోవచ్చు. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రించబడతాయి. ఐరన్ లోపాన్ని కూడా నివారించవచ్చు. ఇంట్లో నిమ్మకాయ టీ తయారు చేసుకోవడానికి నిమ్మకాయ టీ పొడి ఒక అనుకూలమైన ఎంపిక. వేసవి కాలంలో నిమ్మ రసాన్ని ఉప్పుతో కలిపి షర్బత్‌గా వాడడం వల్ల శరీరానికి రీహైడ్రేషన్ కలుగుతుంది. వీటిలోని ఆంటీ యాక్సిడెంట్లు స్పష్టమైన మరియు ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తాయి. చర్మంపై ఏర్పడే మచ్చలు వృద్ధాప్య సంకేతాలను నిమ్మకాయలతో తగ్గించుకోవచ్చు. నిమ్మకాయ రసాన్ని ముఖంపై రుద్దుకోవడంతో స్కిన్ తాజాగా కనిపిస్తుంది. నిమ్మకాయలను ఎండబెట్టి పౌడర్ చేసి మెడిసిన్ తయారు చేస్తారు. నిమ్మ కాయలు, పండ్లు ఎక్కువగా వాడటం వల్ల సిట్రస్ ఎలర్జీ కలుగుతుంది. నిమ్మకాయలను దేవి దేవతల విగ్రహాలకు దండలుగా కూర్చి వేస్తారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు మంత్రాల వంటి మూఢనమ్మకాలతో నిమ్మ పచ్చలను పసుపు కుంకుమ పూసి మూడు బాటలు కలిసిన చోట తిప్పేసుకుంటారు. ఇది ఒక అప నమ్మకం. చూశారుగా బాలలూ! నిమ్మచెట్టు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. నిమ్మ మనకు అమ్మ. తల్లి ఎంత మేలు చేస్తుందో నిమ్మ కూడా మనకు అంతే మేలు చేస్తుంది. బహుళ ప్రయోజనాలు ఉన్న నిమ్మ చెట్లు మన ఇంటి ఆవరణలో, బడి ఆవరణలో పెంచుకుందాం. ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకుందాం

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


మహాత్మా జాతిపిత
గాంధీ
రచన:
జుగాష్‌విలి
బొమ్మలు:
తాతయ్య: ఒరే గోపీ! ఈ రోజు గాంధీ జయంతి కదా. రోజూ నన్ను ప్రశ్నలడుగుతావు. ఈ రోజు నిన్ను అడుగుతాను. జవాబులు చెప్పాలి మరి.
గోపి: భలే! భలే! అడుగు తాతయ్యా.
తాతయ్య: ఈ గాంధీ ఎవరు? ఏమిటి గొప్ప?
గోపి: మన స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకుడు, మార్గదర్శి. అందుకే జాతిపిత అని పిలుస్తారు.
తాతయ్య: గాంధీ ఎక్కడ, ఎప్పుడు పుట్టాడు అసలు పేరు తెలుసా?
గోపి: గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో 1869 అక్టోబర్ 2న పుట్టాడు. మోహనదాస్ కరంచంద్ గాంధీ అసలు పేరు.
తాతయ్య: ఏం చదువుకున్నాడు? ఏం చేసేవాడు?
గోపి: బొంబాయిలో మెట్రిక్యులేషన్ చేసి, ఇంగ్లండ్‌లో న్యాయవాది విద్య అభ్యసించాడు. 1893లో దక్షిణాఫ్రికాలోని భారతీయ రైతుల కేసు వాదించడానికి అక్కడికి వెళ్లాడు. అక్కడ వున్న వర్ణ వివక్ష వల్ల రైలు నుంచి నెట్టివేయబడ్డాడు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి పోరాటాలకు నాయకత్వం వహించాడు. 21 సంవత్సరాలు దక్షిణాఫ్రికా ప్రజలకు సేవలందించారు.
తాతయ్య: ఓ! చాలా విషయాలు తెలుసే. గుడ్... ఇంకా ఏం తెలుసు ఇవన్నీ ఎవరు చెప్పారు.
గోపి: నిన్ననే మా సోషల్ సార్ గాంధీ గురించి చాలా చెప్పారు. గాంధీ అహింసా సిద్ధాంతం ప్రపంచ ప్రజలను ఎంతో ప్రభావితం చేసింది. గాంధీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రపంచ దేశాలన్నీ జరుపుకుంటున్నాయి. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ వంటి శాంతియుత పద్ధతులను స్వాతంత్ర్య ఉద్యమానికి అందించాడని చెప్పారు.


తాతయ్య: గాంధీ కేవలం రాజకీయ నాయకుడే కాదు. సామాజిక కార్యకర్త కూడా. ఇది తెలుసా!
గోపి: తెలుసు తాతయ్యా! ఎక్కువ సమయం మురికి వాడల్లో పారిశుద్ధ్యం గురించి, మద్యపాన అలవాటును మాన్పించడానికి, వ్యవసాయ పద్ధతులు వివరించడానికి, అహింస, ఆధ్యాత్మిక, నైతిక విలువలు బోధించడానికి ఉపయోగించాడు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని నమ్మాడు.
తాతయ్య: గొప్ప సంఘ సంస్కర్త కూడా...
గోపి: అవును తాతయ్యా! అంటరానితనం, నిరక్షరాస్యత వంటి సామాజిక వివక్షలకు గురవుతున్న నిమ్నజాతి ప్రజలను హరిజనులుగా గుర్తించి దేవాలయ ప్రవేశానికి, ఆధ్యాత్మిక నైతిక విలువల స్థాపనకు కృషి చేసాడు.
తాతయ్య: ఇంకా?
గోపి: గాంధీ గొప్ప రచయిత. అతని రచనలు పలు సంపుటాలుగా ముద్రించారు. టాల్‌స్టాయ్, రస్కిన్ అంటే ఇష్టమట. ముల్కరాజ్ ఆనంద్ రచనలు, సుబ్బులక్ష్మి సంగీతం ఇష్టమట. ముల్కరాజ్ ఆనంద్ ది అన్‌టచ్‌బుల్ గ్రంథానికి ముందుమాట రాశారు.
గోపి: దేశ విభజనకి కారణమని నమ్మి సాధూరామ్ గాడ్సే గాంధీని 1948 జనవరి 30న ఢిల్లీలో తుపాకీతో కాల్చి చంపాడు. కాని గాంధీకి దేశ విభజన ఇష్టం లేదని దేశంలో అంతర్యుద్ధం ఆపడానికి అంగీకరించక తప్పలేదట తాతయ్యా!
తాతయ్య: అవును. గాంధీ మానవులంతా ఒకటే అని నమ్మిన వాడు. 'విభజించి పాలించు' అనే బ్రిటిష్ పాలకుల కుట్రకు దేశం బలయింది.
తాతయ్య: మీ టీచర్‌కి థాంక్స్ గోపి, చాలా విషయాలు చెప్పారు. నీకూ థాంక్స్‌రా.
గోపి: పో... తాతయ్య. మీరే నా మొదటి గురువు
గోపి : గాంధీగారి ఆత్మకథ, సత్యశోధన పుస్తకాలు చదవమని మా టీచర్ చెప్పారు. తెచ్చి పెట్టు తాతయ్యా.
తాతయ్య: అలాగే గోపి!
GANDHI
AN AUTOBIOGRAPHY

స్పోర్ట్స్



# నవంబర్‌లో అంధుల మహిళల టీ 20 ప్రపంచ కప్...

నవంబరులో అంధుల మహిళల తొలి టీ20 ప్రపంచ కప్ (Blind Women's T20 World Cup 2025) జరగనుంది. భారత్ వేదికగా నవంబర్ 11 నుంచి 25 వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో పాక్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని భారత అంధుల క్రికెట్ సంఘం (CABI) నిర్ణయించగా, ప్రపంచ అంధుల క్రికెట్ మండలి (WBCC) ఆమోదం తెలిపింది. భారత్-పాక్ క్రికెట్ సంబంధాలు నిలకడగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

మొదట భారత్-నేపాల్ సంయుక్త ఆతిథ్యంతో జరగాల్సిన ఈ వరల్డ్ కప్, నేపాల్‌లో జెన్‌జెడ్ నిరసనలు, రాజకీయ పరిణామాల కారణంగా శ్రీలంకను కో-హోస్ట్‌గా చేర్చారు. మ్యాచ్‌లు ఢిల్లీ, బెంగళూరు, ఖాట్మండు, కొలంబో వేదికలపై జరుగనున్నాయి.

ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, శ్రీలంక, అమెరికా (USA) జట్లు బరిలోకి దిగనున్నాయి. మొత్తం 21 లీగ్ మ్యాచ్‌లు, అనంతరం రెండు సెమీఫైనల్స్, ఆపై ఫైనల్ పోరు జరుగుతుంది. భారత జట్టును ఈ సందర్భంగా ప్రకటించారు. దీపికా టీసీని కెప్టెన్‌గా నియమిస్తూ, 16 మంది ఆటగాళ్లతో కూడిన జట్టును భారత అంధుల క్రికెట్ సంఘం ఎంపిక చేసింది.

– బాలచెలిమి డెస్క్

మ్యాథ్స్ ట్రిక్స్

# జీవిత కాలం మొత్తం

1. మీరు మీ పుట్టిన సంవత్సరమును తీసుకోండి.
2. ఇప్పటి వరకు మీ జీవితంలో మరచిపోలేని సంవత్సరమును తీసుకోండి.
3. మీ వయస్సు తీసుకోండి.
4. మరచిపోలేని సంవత్సరాన్ని ప్రస్తుత సంవత్సరానికి బేధాన్ని తీసుకోండి.
5. ఆ నాలుగింటిని కూడండి.
6. ఆ మొత్తాన్ని ముందుగానే వ్రాసాను చూడండి. అని ఒక సంఖ్యను చూపించాలి. ఆ సభలో ఎన్ని వేల మంది వున్నా అందరి జవాబు ఒకటే అవుతుంది.

ఉదా :

| | |
|---|---|
| పుట్టిన సంవత్సరం | 1965 |
| మరపురాని సంవత్సరం | 1985 |
| ప్రస్తుత వయసు | 55 |
| 2020-1985 ల బేధం | 35 |
| **మొత్తం** | **4040** |

రహస్యం:

ప్రస్తుత సంవత్సరం × 2

2020 × 2 = 4040

## BEAUTY NUMBER

25692359 x nines' multiples
25692359 x 9 = 231321231
25692359 x 18 = 462462462
25692359 x 27 = 693693693
25692359 x 36 = 924924924
25692359 x 45 = 156156155
25692359 x 54 = 1387387386
25692359 x 63 = 1618618617
25692359 x 72 = 1849849848
25692359 x 81 = 208108107079

– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937



# దసరా – పిల్లల సరదా

దసరా పండుగ పిల్లలకు ఎంతో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని పంచేది. ఎందుకంటే పండగ ముందు రోజుల్లో ఇంట్లో అమ్మ ఇల్లు సర్దుతుంటే వారు చూస్తూ ఉంటారు. వారి చిన్ని మనసులో అమ్మ ఒకటే ఎందుకు చేయాలి? మనమూ ఆ పనిలో అమ్మకి సాయం చేస్తే పని కూడా తొందరగా పూర్తి అవుతుంది కదా! అనుకున్నదే తడవు పిల్లలు గబగబా గూళ్లను సర్దేసి అందులో సామాన్లు శుభ్రపరిచి, యథాస్థానాల్లో అమర్చారు కొందరు పిల్లలు. అలాగే అమ్మ గదులు కడిగితే సహాయంగా ముగ్గులు వేయడం గడపలకు బొట్లు పెట్టడం, బంతిపూలు,మామిడి ఆకులతో తోరణాలు కట్టి గుమ్మాలకు, గేట్లకు అలంకరించారు. కొంతమంది మగ పిల్లలు రకరకాల పూలను సేకరించారు వాటిలో గునుగ పూలు, తంగేడు పూలు, గుమ్మడి పూలు, బంతిపూలు చామంతులు ఇలా రకరకాల పూలు తీసుకొని వచ్చారు. అమ్మ వంట చేస్తుంటే ఆసక్తిగా చూస్తూ తాము కూడా అమ్మతో వంటలలో సాయం చేసే పిల్లలు కొందరు. అమ్మ పని తొందరగా అయిపోతే మాతో సరదాగా, కబుర్ల గురించి, పండగల గురించి చక్కటి కథలు చెప్తుంది. దానిలో భాగంగా మహిషాసురమర్దని గురించి తెలుపుతూ మహిషాసురుడు అనేక రూపాలను దాల్చుతూ తప్పించుకుంటున్నడు, కాళికాదేవి అతనిని దున్నపోతు అవతారంలో కనుగొని సంహరిస్తుంది, అని చెప్పింది. దాని ఆధారంగా పిల్లలు కూడా వేషధారణలు మార్చి ఆటలాడు పిల్లలు కొందరు.

భారతదేశపు పండుగలు కేవలం ఆనందం కోసం మాత్రమే కాకుండా, మన జీవన విధానంలో మంచి విలువలను నేర్పుతాయి. దసరా లేదా విజయదశమి పండుగ మంచి చెడుపై గెలిచే గుర్తుగా మనం జరుపుకుంటాం. రామాయణంలో రావణుడు సీతను అపహరించగా, రాముడు లక్ష్మణుడు, హనుమంతుడు, సుగ్రీవుడు మరియు వానర సేనతో కలిసి లంకకు వెళ్లి ఆమెను రక్షించేందుకు కృషి చేస్తారు. సముద్రాన్ని దాటేందుకు రాళ్లపై "శ్రీరామ"





# బతుకమ్మ

అమ్మ అనురాగానికి ఉయ్యాలో
నాన్న ఆప్యాయతకు ఉయ్యాలో
పంచుతూ ఉండాలి ఉయ్యాలో
మధుర మాధుర్యాలు ఉయ్యాలో
అన్నకు జిలేబిలు ఉయ్యాలో
చెల్లికి గులాబీలు ఉయ్యాలో
అక్కకి చెక్కిలాలు ఉయ్యాలో
తాత మనవళ్లకు ఉయ్యాలో
బొబ్బట్లు పెట్టండి ఉయ్యాలో
సకినాలు- చేగోడీలు ఉయ్యాలో
నాన్నమ్మకు నాకు ఉయ్యాలో

లడ్డూలు, సున్నుండలు ఉయ్యాలో
నవ్వుల పిల్లలకి ఉయ్యాలో
నువ్వులుండలండి ఉయ్యాలో
గారెలు బూరెలు ఉయ్యాలో
ఊరందరికీ పంచాలి ఉయ్యాలో
అయ్యవారికి చాలు ఉయ్యాలో
ఐదు వరహాలు ఉయ్యాలో
పిల్లగాండ్లకు చాలు ఉయ్యాలో
పప్పు బెల్లాలు ఉయ్యాలో
ఆటపాటలతోని ఉయ్యాలో
ఆనందంగా ఉందామా ఉయ్యాలో

పల్లెలు పచ్చదనాలలోగిళ్ళతో
పంటలు పండును పొదిరిళ్ళతో
చిరుధాన్యాల సవ్వడిగా
పిల్లల కన్నుల పండుగగా
చిందాలి ఆనందం నిండుగా
ప్రకృతి పులకించిన పరవాళ్ళుగా
మన ఆరోగ్యానికి అవధులుగా
మన నేల పచ్చదనం ఉండాలి
కన్నుల పండుగగా
సమతుల ఆహారం
మనందరికీ అధిక బలం



అని రాసి వంతెన కట్టినట్లు కథ చెబుతుంది. ఇవి నీటిలో మునగకుండా తేలుతాయన్నది నమ్మకం. దీని ద్వారా మనం పట్టుదలతో, ఐక్యతతో, వ్యూహంతో అసాధ్యాన్ని సైతం సాధ్యం చేయవచ్చని తెలుసుకోవచ్చు.

ఉత్తర భారతదేశంలో దసరా సందర్భంగా రామలీలా అనే నాటకాలు ప్రదర్శించబడతాయి. చివరి రోజున రావణుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడు బొమ్మలను ప్రజల సమక్షంలో దహనం చేస్తారు. ఇది చెడు మీద మంచి గెలుపుని సూచిస్తుంది. పండుగ సమయంలో జరిగే మేళాలు, ప్రదర్శనలు, ఆటపాటలు మనకు ఆనందంతో పాటు పరస్పర బంధాలను బలపరుస్తాయి.

దసరా పండుగ మనకు చాలా గొప్ప పాఠాలు నేర్పుతుంది. సత్యం, సహనం, సహకారం వంటి మంచి గుణాలు ఎప్పుడూ గెలుస్తాయి. రావణుడు శక్తిమంతుడే అయినా అతని అహంకారం, స్వార్థం వల్ల ఓడిపోయాడు. మనం కూడా మనలో ఉండే ద్వేషం, అసూయ, అహంకారం, పక్షపాతం వంటి చెడు లక్షణాలను వదిలేయాలి. నిజాయితీ, ధైర్యం, సహాయం వంటి మంచి గుణాలను పెంపొందించాలి. అప్పుడే ఈ పండుగ యొక్క అసలైన అర్థం.

మన సంస్కృతి పట్ల, ప్రకృతి పట్ల, శుభ్రత పాటించి, కుటుంబం పట్ల ప్రేమ, ఐక్యతా విలువల్ని నేటి పిల్లలకి మనం నేర్పితే, వారు తర్వాత తరాల వారికి నేర్పుతారు. పిల్లలూ మీకు అర్థమవుతుంది కదా మీరు కూడా మీ అమ్మకి ఇలాగే సాయం చేయాలి. సరేనా!

మంచిగా ప్రవర్తించండి. మంచిని ఆశ్రయించండి. ఇదే నిజమైన దసరా ఆనందం.

– కృష్ణ పద్మ
తెలుగు ఉపాధ్యాయురాలు, హైదరాబాద్

క థ

# బుజ్జి కుందేలు ఇక సెలవ్

## పావెల్ కొవల్యోవ్



అనగనగా ఒక ఊరిలో ఓ ముసలి తాతయ్య ఉండేవాడు. వేసవి సెలవులకు అతని మనవడు, మనవరాలు వచ్చారు.

వాళ్ల ఇల్లు రహదారి ప్రక్కనే ఉంటుంది. రహదారి పైన ఎవరు వెళ్ళినా వాళ్ళకు కనిపిస్తారు.

ఓ రోజు ఒక వ్యక్తి బుజ్జి కుందేలును పట్టుకుని వాళ్ళ ఇంటి ముందు నుండి వెళ్తున్నాడు.

పిల్లలిద్దరూ ఆసక్తిగా అతని వద్దకు వెళ్ళి కుందేలును చూశారు.

అది తెల్లగా, బూడిద రంగు మచ్చలతో చాలా అందంగా ఉంది.

"కుందేలుని పెంచుకుంటారా పిల్లలూ?" అడిగాడా వ్యక్తి.

"ఓ తప్పకుండా!" అన్నారు పిల్లలు.

"దీనికి కాలికి గాయమయింది. కాబట్టి గాయం నయం అయేదాకా జాగ్రత్తగా చూసుకోండి" అని చెప్పాడా వ్యక్తి.

"ఈ బుజ్జి కుందేలుని ఎక్కడ పెడదాం తాతయ్యా" అని అడిగారు పిల్లలు.

"ఆలోచిద్దాం" అన్నాడు తాతయ్య.

పిల్లవాడు కొన్ని క్యాబేజి ఆకులు తెచ్చాడు. కుందేలు కోసం. కాని అది తినలేదు. పాప కొన్ని తాజా పాలను తెచ్చింది. కాని అది పాలనూ తాగలేదు. అది భయంతో వొణుకుతుంది. తాతయ్య దాని తలను, పొడవైన చెవులను నిమిరాడు.

దాని తలను పాల గిన్నెలో ముంచాడు. అది తన నాలుకతో మూతిని నాక్కుంది. తరువాత మెల్లగా పాత్రలోని తాజా పాలను తాగింది. బుజ్జి కుందేలును ఓ చెక్కపెట్టెలో పెట్టారు. గాలి ఆడటం కోసం చెక్కపెట్టెకు కిటికీలు ఉంచారు.

ఓ వారం గడిచింది. రోజూ కుందేలు తాజా పాలు తాగేది. క్యాబేజీ ఆకులను, క్యారెట్ ముక్కలను ఇష్టంగా తినేది. కుందేలు కాలి గాయం కూడా నయమయింది. అది పిల్లలతో బాగా ఆడుకునేది. మంచి స్నేహితులయ్యారు వాళ్ళు. ఊర్లో పిల్లలందరూ దాన్ని చూడడానికి రోజూ వచ్చేవాళ్ళు. చివరికి పిల్లలు దాన్ని పట్టణం తీసుకు వెళతామన్నారు. "మూగజీవుల్ని బంధించడం పాపం" అని తాతయ్య చెప్పాడు. అది ఆనందంగా గడ్డిలో గెంతుతూ మాయమైంది.


స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల


m : 81792 73971


ఇంగ్లీష్ : గుడ్ లక్, లిటిల్ హెర్

రచయిత : పావెల్ కొవెల్యోవ్

ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

# నలుగురు సోదరులు – అస్థిపంజరం కథ



అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరిలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారు. వారిలో మొదటి ముగ్గురు మంత్ర శాస్త్రంలో ఆరితేరిన వారు. వారిలో చివరి వాడికి చదువు అబ్బలేదు. కానీ వాడు తెలివి తేటలు, సూక్ష్మబుద్ధి కలవాడు, చురుకైనవాడు.

ఒక రోజు అన్నదమ్ములు తమ విద్యను రాజుగారి దగ్గర ప్రదర్శించి ధనం సంపాదించాలని అనుకున్నారు. వారంతా రాజధానికి బయలుదేరారు. వారితోపాటు చివరివాడు కూడా బయలుదేరగా, వాణ్ణి తమతో రావద్దన్నారు. చదువురాని వాడు తమతో రావడం దండగ అని వారు అనుకున్నారు. కానీ చివరివాడు ఎంతగానో బ్రతిమాలాడు. ఎలాగైతేనేం, చివరకు అతణ్ణి తమతో తీసుకుని వెళ్ళడానికి అన్నలు అంగీకరించారు.

వారు కొండలూ, కోనలూ దాటి వెళుతుండగా ఒక సింహం అస్థిపంజరం కనిపించింది. అన్నదమ్ములు ఆ అస్థిపంజరానికి ప్రాణం పోసి తమ విద్యను పరీక్షించుకోవాలి అనుకున్నారు.

అప్పుడు చివరివాడు అది ప్రమాదకరమని, ఆ పని చెయ్యవద్దని తన అన్నల్ని హెచ్చరించాడు. కానీ వాడి మాటలు పట్టించుకోకుండా వారు సింహం ఎముకలు ఒకచోట చేర్చి మంత్రాలు చదవడం మొదలు పెట్టారు. చివరి వాడు ఇక లాభం లేదు అనుకుని ప్రక్కనున్న చెట్టు ఎక్కి కూర్చున్నాడు. అన్నలు చదివిన మంత్రాల మహిమతో సింహం ఒక్క నిముషంలో ప్రాణంతో లేచి నిలబడింది. క్రూరంగా ఆ ముగ్గుర్నీ చంపి తన దారిన వెళ్ళిపోయింది.


**నీతి : నైపుణ్యాన్ని సంపాదించడమే చదువు కాదు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకోగలిగే విచక్షణా శక్తిని ఇచ్చేదే అసలైన విద్య.**

సేకరణ : అమరావతి





కథ




# కనువిప్పు

పూర్వం "సింగవరం" అనే గ్రామంలో "శివ రామయ్య" అనే సన్నపాటి రైతు ఉండేవాడు. శివరామయ్యకు ఆరోగ్యం సరిగా ఉండేది కాదు అందుకని తనకున్న రెండెకరాల పొలాన్ని కౌలుకిచ్చి ఆ వచ్చిన దానితోనే సర్దుకుని జీవించే వాడు. శివరామయ్యకు "శంకరయ్య" అనే కొడుకు ఉండేవాడు. శంకరయ్య చిన్నప్పట్నుంచి వీసమెత్తు పని చేయకుండా సోమరిగా తిరిగేవాడు. స్నేహితులతో ఆటాపాటా అంటూ కాలక్షేపం చేసేవాడు. తండ్రి ఎంత చెప్పినా ఖాతర్ చేసేవాడు కాదు. కొడుకు అలా తయారు కావడానికి కారణం తల్లి మీనాక్షమ్మ చేస్తున్న అతిగారాభమే. ఉన్న ఒక కొడుకు అలా సోమరిగా తయారు కావడం తండ్రికి తీరని ఆవేదనే మిగిల్చింది. శంకరయ్య విషయంలో అప్పుడప్పుడు భార్యతో గొడవ పడుతూ "నీ గారాబం వల్లనే వాడు అలా తయారయ్యాడు రేపు వాడికి పిల్లను ఎవరు ఇస్తారు! పెళ్లి ఎలా అవుతుంది"? అంటుండే వాడు. దానికి ఆమె "ఎందకవదూ? వాడికేం లోటూ! అయినా మా అన్న కూతురు లేదూ? బంగారు లక్ష్మి, అది వాడి కోసమే పుట్టింది" అనేది. ఇక అలా.. అలా.. చూస్తుండగానే శంకరానికి పెళ్లీడు వచ్చింది. ఒక రోజు శంకరం తల్లి ఆమె తన అన్నగారు ఉండే ఊరికి వెళ్లి అన్నతో బంగారు లక్ష్మి పెళ్లి విషయం ప్రస్తావించింది దానికి అతడు "చూడు నీ కొడుకు వట్టి సోమరిపోతు. పని పాట లేని బలాదూర్, నా కూతురుని ఎలా సాకుతాడు?" అని నిక్కచ్చిగా అంటాడు. మీనాక్షమ్మకు తన అన్నయ్య నుంచి అలాంటి సమాధానం వస్తుందని ఊహించలేదు. గొంతులో వెలక్కాయపడ్డట్టయింది. వెంటనే కళ్ళల్లో నీళ్లు బొట బొట కారాయి. నోట మాట రాలేదు "అదేంటన్నయ్యా! చిన్నప్పటి నుంచి అనుకున్నదే కదా! బంగారు లక్ష్మి శంకరం పెళ్ళామే అని. ఇప్పుడు ఇలా మాట్లాడుతున్నావేంటి?" అన్నది శోకాలు పెడుతూ. దానికి అతను "ఎవడికి తెలుసు! మీ వాడు ఇంత

ప్రయోజకుడు అవుతాడని?” ఎద్దేవా చేశాడు. మీనాక్షమ్మకు కోపం వచ్చింది అలిగి ఇంటి దారి పట్టింది అంతదాకా అక్కడే ఉన్న బంగారు లక్ష్మి అత్తని వారిస్తూ తండ్రితో “నాన్న నేను శంకరం బావనే చేసుకుంటాను బావ జాడ్యాన్ని వదిలించి మంచి ప్రయోజకుడిగా మార్చేస్తాను చూడు! బావ నిజానికి సోమరిపోతు కాదు. సరైన అవకాశాలు లేక, చేయదగ్గ పని లేక, చెప్పేవారు లేక కొందరు అలా పనికి రాని వారిలా తయారవుతారు పుట్టుకతోనే ఎవరూ ప్రయోజకులు కారు. సాన బట్టకపోతే వజ్రం కూడా రాయిలాగే ఉంటుంది.” అన్నది. తండ్రి “అయితే నీ ఇష్టం! జీవితం అంతా నీకే కష్టం, నాకెందుకు అభ్యంతరం” అన్నాడు మీనాక్షమ్మ ఆనందంగా కోడల్ని కౌగిలించుకుంది. ఒక మంచి ముహూర్తాన శంకరానికి బంగారు లక్ష్మికి, పెళ్లి జరిగింది. కాలం గడుస్తున్నది శంకరంలో ఏ మార్పు లేదు పైగా కుటుంబంలో మరో మనిషి చేరింది. శివరామయ్యకి ఏం చేయాలో పాలు పోలేదు. ఒకరోజు బంగారు లక్ష్మి మామ గారితో “చూడండి! మామయ్యా! మాఅమ్మా వాళ్లను చూడాలనిపిస్తుంది మీ అబ్బాయి నేను కొద్ది రోజులు పాటు మా ఇంట్లో ఉండి వస్తాం”. అన్నది. శివరామయ్య సరే నన్నాడు. వెంటనే ఆమె శంకరాన్ని తీసుకొని తల్లి గారి ఇంటికి వెళ్ళింది. తల్లితో ఏం చేయాలో తన ఆలోచన గురించి వివరంగా చెప్పింది. అందుకు తల్లి నవ్వి “సరేనమ్మా అలాగే చేద్దాం!” అన్నది. మొదటిసారిగా ఇంటికి వచ్చిన అల్లుడుని చూసి అత్తమామలు బావమరిది అందరూ పరమానందం చెందారు, సకల మర్యాదలు చేశారు. రకరకాల పిండి వంటలతో షడ్ర షోపేతమైన భోజనం వడ్డించారు ఆ మర్యాదలకు శంకరం ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. మొదట బాగానే అనిపించింది. అలా వారం రోజులు, పది రోజులూ, గడిచాయి ప్రతిరోజు కూడా అలాగే మర్యాదలు చేస్తూ శంకరాన్ని కాలు కింద పెట్టకుండా చూసుకుంటున్నారు. ఏ లోటు రానివ్వడం లేదు. అత్తగారైతే కొసరి కొసరి వడ్డిస్తుంటే శంకరానికి తినడం, కూర్చోవడం వెగటు పుట్టించింది సిగ్గుగా అనిపించేది. అత్తవారింటి పరిస్థితి తన ఇంటి పరిస్థితి కంటే భిన్నంగా ఉంది. వాళ్లది వ్యవసాయ కుటుంబం ఏ ఒక్కరు ఖాళీగా కనిపించరు అందరూ వేకువతోనే లేస్తారు ఒకరు పశువుల పేడ తీయడం ఒకరు మేత వేయడం, పాలు పితకడం, ఇంట్లో ఆడవాళ్లు వంట చేయడం తిని అందరు పొలానికి వెళ్లడం మళ్లీ సాయంత్రానికి ఇల్లు చేరడం ఎవరి పనులు వాళ్ళు చూసుకోవడం నిత్య కృత్యమే అయినా అలా యంత్రాల్లాపని చేస్తూ కూడా వాళ్లంతా ఎంతో సంతోషంగా కనిపిస్తుండటం శంకరానికి ఆశ్చర్యం వేసేది. తనకు మాత్రం మర్యాదలు యధావిధిగా జరుగుతూనే ఉన్నాయి. మరి వాళ్లంతా క్షణం తీరిక లేకుండా కష్టపడుతుంటే తనేమో చేతగానివాడిలా తిని కూర్చోవడం. తన మీద తనకే అసహ్యం వేసింది. ఒకరోజు మామ గారితో “నేను కూడా మీతో పాటు పొలం పనికి వస్తున్నాను ఇలా తిని కూర్చోవడం నాకు కష్టంగా ఉంది” అన్నాడు. దానికి మామగారు “అయ్యో అదేంటి అల్లుడు గారూ! మీరు మా ఇంట్లో పని చేయడం ఏంటి? తప్పు, తప్పు! ఈ పనులన్నీ మీకు అలవాటు లేదు కూడాను” అన్నాడు. దానికి శంకరం “లేదు లేదు! మీరంతా ఇలా కష్టపడి పనులు చేస్తుంటే నాకు అంతా కొత్తగా అనిపిస్తుంది. కష్టపడి పని చేయడంలో ఇంత ఆనందం ఉంటుందని ఇక్కడే తెలుసుకున్నాను. నన్ను కూడా మీతోపాటు పని చేయనీయండి” అన్నాడు దానికి మామగారు ససేమిరా అన్నాడు. శంకరం కాస్త అలక బూని “మర్యాదల పేరుతో నన్ను శిక్షిస్తున్నట్టున్నారు అలాగైతే నేను ఇక్కడ సంక్రాంతి పండుగ దాకా ఉండను, ఈ రోజు మా ఊరు వెళ్ళి పోతున్నాను” అన్నాడు. ఇక బంగారు లక్ష్మి కల్పించుకొని తండ్రితో “పోనీలే నాన్నా! తనని కూడా పొలం తీసుకెళ్దాం అంది” దానికి తండ్రి సరే అమ్మా మీ ఇష్టం! అన్నాడు ఆ రోజు నుండి శంకరం అందరితో పాటు కష్టపడి పని చేయడం అలవాటు చేసుకున్నాడు. ఇప్పుడు తను ఎంతో సంతోషంగా ఉండగలుగుతున్నాడు జీవితం సరికొత్తగా అనిపించింది. తర్వాత సంక్రాంతి పండగ దాకా ఉండి భార్యాభర్తలు తమ ఇంటికి వచ్చారు. శంకరం తండ్రితో “ఇక మనం పొలం ఎవరికీ కవులకు ఇవ్వద్దు నాన్నా! మనమే ధాన్యం పండిద్దాం! నేను కష్టపడి పని చేస్తాను. కష్టం విలువ తెలుసుకున్నాను” అన్నాడు. అన్నట్టుగానే శంకరం కష్టపడి పని చేయడం ప్రారంభించాడు కొడుకులో వచ్చిన ఈ మార్పు చూసి తల్లీ తండ్రి, కోడలు లక్ష్మిని ఎంత గానో కొనియాడారు.

– బూర్లే నాగేశ్వరరావు

కోదాడ
m : 9848419950







# రెండు వేల ఏండ్ల క్రిందట వ్యాపార వాణిజ్యాలు

రెండు వేల ఏండ్ల కిందట తెలంగాణ ప్రాంతం మొదలుకొని భారత దేశంలో చాలా భాగాన్ని పరిపాలించిన శాతవాహన సామ్రాజ్య సంపదలో ప్రధాన పాత్ర వ్యాపార వాణిజ్యాలది. పశ్చిమ దేశాలతో, తూర్పు దేశాలతో సముద్ర మార్గాల ద్వారా వాణిజ్యం జరిగేది. పశ్చిమంలో అరేబియా సముద్రం, తూర్పున బంగాళాఖాతం ఉండగా, గోదావరి, కృష్ణ, నర్మద, తపతి వంటి నదుల ద్వారా సరుకులు తీర రేవులకు చేరేవి.

**ప్రధాన రేవులు:** పశ్చిమంలో భరుకచ్ఛ (బేరిగజ), సోపార, వైజయంతి, చేబ్బీ... తూర్పున మచిలీపట్నం, దంతపురం, మోటుపల్లి, గూడూరు. కృష్ణా తీరంలోని ధాన్యకటకం (అమరావతి), విజయపురి, ఘంటశాల వంటి పట్టణాలు, గోదావరి తీరంలోని ధర్మపురి, రాయపట్నం, కోటిలింగాల, మంథెన, కాళేశ్వరం వర్తక కేంద్రాలుగా వర్ధిల్లాయి. ధర్మపురి-కాళేశ్వరం మధ్య శాతవాహన రహదారి ఉండేదని తెలిపే పురావస్తు ఆనవాళ్లు వెలుగు చూసాయి. 'లీలావతి' అనే ప్రాకృత కావ్యంలో శాతవాహన రాజు హాలుడు సప్తగోదావరి మీదుగా ప్రతిష్ఠానం వెళ్ళాడని సమాచారం ఉంది.

**వర్తక శ్రేణులు:** వీటిని నిగమ, నికాయశ్రేణి అని పిలిచేవారు. వీటి నేత శెట్టి లేదా గహపతి శెట్టి. ఒక్కో శ్రేణికి ప్రత్యేక సరుకుపై గుత్తాధిపత్యం ఉండేది. ప్రధానంగా ఇవి నదీ తీర పట్టణాల్లో ఉండేవి. కోటిలింగాలలో శాతవాహన కోట, రేవు ఉండేవి. దానికి ఎదురుగా లక్సెట్టిపేట అనే పట్టణం ఉంది. లక్సెట్టిపేటలో లక్ష శెట్టీలు ఉండేవారట. ఈనాటి ఆంధ్రలోని ధాన్యకటకం, విజయపురి, ఘంటశాలలో ఉండిన ధనిక వర్తకుల ఆధారాలు లభించాయి.

**రవాణా పద్ధతులు:** ఎడ్లబండ్లపై సరుకులు తరలించి, దొంగల భయం వల్ల గుంపులుగా ప్రయాణించేవారు. బలవంతులను సైనికులుగా పెట్టుకునేవారు.

**తూర్పు వాణిజ్యం:** మలయా దేశం నుండి చందనం, ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, సుమత్రా నుండి బంగారం వచ్చేవి. చైనాతో పట్టు, కర్పూరంలో వాణిజ్యం జరిగేవి. తెలుగువారు తూర్పు దేశాలకు వలస వెళ్ళి నగరాలకు తమ ఊర్ల పేర్లు పెట్టారు (త్రిలింగ్, విజయపురి, కకుల మొదలైనవి).

**పశ్చిమ వాణిజ్యం:** శాతవాహన రేవుల నుంచి నౌకలు ఈజిప్టు, తూర్పు ఆఫ్రికా, రోమ్ వరకు సరుకులు తీసుకు వెళ్ళేవి. 'పెరిప్లస్ ఆఫ్ ఎరిథ్రియన్ సీ' అనే గ్రంథంలో త్రప్పగ, చటింబ అనే పడవల ప్రస్తావన ఉంది. శాతవాహన చక్రవర్తి యజ్ఞశ్రీ శాతకర్ణి నాణేలపై తెరచాపల ఓడల చిత్రాలు ఉన్నాయి. ఆనాటి తెలుగువారే చుక్కానిని కనిపెట్టారని ఆధారాలు ఉన్నాయి.

**ఎగుమతులు:** రాగి, చందనం, బియ్యం, నెయ్యి, బట్టలు, శంఖులు, రత్నాలు, ముత్యాలు, వజ్రాలు, ఏనుగు దంతపు వస్తువులు, లవంగాలు, విలాస వస్తువులు. దిగుమతులు: రోమ్ నుంచి మద్యం, గాజు సామానులు.

**ఆర్థిక ప్రభావం:** భారతీయ సరుకులు రోమ్‌లో వందల రెట్ల ధరలకు అమ్మబడడంతో రోమన్ల బంగారం భారత దేశానికి పారిపోయిందని ప్లినీ అనే సమకాలీన చరిత్రకారుడు వాపోయాడు. రోమన్లు నకిలీ నాణేలు తయారు చేయడం ప్రారంభించగా, వైసాస్పియస్ కాలంలో బంగారం ఎగుమతులను నిషేధించారు. దీంతో రోమ్-శాతవాహన వాణిజ్యం తగ్గింది. గ్రామాల్లో మాత్రం వస్తుమార్పిడి ఎక్కువగా ఉండేది.

-డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

# సఫీనా హుస్సేన్

## ఒక బాలిక చదువుతో సమాజానికే వెలుగు




పుట్టుక, పరిస్థితులు, కుటుంబ ఆర్థిక స్థితి... ఇవన్నీ మన భవిష్యత్తును నిర్ణయించవు. జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లగల శక్తి ఒక్కటే ఉంది – అది విద్య. విద్య ఉంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, బతుకుపై నమ్మకం వస్తుంది. ముఖ్యంగా సామాజిక లింగవివక్షను ఎదుర్కొంటున్న ఆడపిల్లలకు ఇది అత్యంత ప్రధానమైన మార్పు సాధనం. ఈ సత్యాన్ని తన జీవితానుభవాల ద్వారా బలంగా గ్రహించి, ఆ దిశగా కృషి చేసిన మహిళే సఫీనా హుస్సేన్.

ఢిల్లీలో ఒక ఇరుకింట్లో పెరిగిన సఫీనా, ప్లస్‌టూ పూర్తయ్యాక ఇంట్లో వాళు పెళ్లి చేయాలనుకున్నారు. దాంతో ఆమె చదువు మూడు సంవత్సరాల పాటు ఆగిపోయింది. అయితే చదువు పట్ల ఉన్న మక్కువను మాత్రం విడిచి పెట్టలేదు. బంధువు ప్రోత్సాహంతో మళ్లీ విద్యాభ్యాసంలో అడుగు పెట్టిన ఆమె, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సీటు సంపాదించింది. అక్కడి నుంచి పట్టా పొందిన తర్వాత కార్పొరేట్ రంగంలో పలు అవకాశాలు వచ్చినా, ఆమె మనసు మాత్రం ప్రశాంతంగా ఉండలేదు. ఎందుకంటే తన కలలన్నీ సమాజంలోని ఆడపిల్లల కోసం ఏదో చేయాలన్న ఆత్మవిశ్వాసం ఆమెను భారత్‌కి తిరిగి తీసుకు వచ్చింది.



"విద్యే భవిష్యత్తుకు వెలుగు – ప్రతి అడుగు సమాజ ప్రగతికి దారి. "విద్యా మార్గంలో నవ్వుల ప్రయాణం"

Cover Page Photo

2007లో సఫీనా ఎడ్యుకేట్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు మానేసిన పిల్లల సమస్యను పరిష్కరించాలంటే ముందుగా అత్యధిక డ్రాప్‌అవుట్ ఉన్న జిల్లాలను గుర్తించాలని ఆమె నిర్ణయించారు. మొదట రాజస్థాన్‌లోని పాలి జిల్లాలో ప్రారంభమైన ఈ ప్రయాణం, ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని 30,000 గ్రామాలకు విస్తరించింది.


ఎడ్యుకేట్ గర్ల్స్ విజయానికి ప్రధాన బలం గ్రామీణ వాలంటీర్లు. ప్రతి ఊరిలో "టీమ్ బాలిక" అనే వాలంటీర్ బృందాలు ఏర్పాటయ్యాయి. వీరు ఇంటింటికీ వెళ్లి చదువు మానేసిన బాలికలను గుర్తించి, వారి కుటుంబాలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించి, తిరిగి పాఠశాలలో చేర్పిస్తారు. ప్రస్తుతానికి ఇలాంటి 23,000కు పైగా టీములు పని చేస్తున్నాయి. వీరి కృషి వల్ల ఇప్పటివరకు 20 లక్షలకుపైగా బాలికలు తిరిగి పాఠశాలలో చేరారు. చదువు ఆపేసిన యువతీ యువకుల కోసం ప్రత్యేక పరీక్షలు రాయించే అవకాశం కల్పించడం, వృత్తి విద్యలో చేర్పించడం, చిన్న ఉద్యోగాలు పొందేలా సాయం చేయడం వంటి పలు మార్గాల్లో ఈ సంస్థ తోడ్పడుతోంది. దీర్ఘకాల లక్ష్యం మాత్రం ఒకటే చదువు విడిచిన ప్రతి బాలికను తిరిగి విద్యలోకి తేవడం. భవిష్యత్తులో కోటికి పైగా బాలికలకు అండగా నిలవాలన్నది సఫీనా ఆశయం.

సఫీనా హుస్సేన్ చేసిన ఈ అసాధారణ సేవలకు గుర్తింపుగా, 2025లో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థకు ప్రతిష్ఠాత్మకమైన రామన్ మెగసెసే అవార్డు లభించింది. ఆసియా నోబెల్‌గా పిలవబడే ఈ పురస్కారం ఆమె కృషికి గ్లోబల్ స్థాయిలో గౌరవం తీసుకొచ్చింది. సఫీనా కథ చెప్పేది ఒక గొప్ప సత్యం – విద్య అంటే కేవలం వ్యక్తిగత భవిష్యత్తునే కాదు, మొత్తం సమాజాన్నే మార్చగల శక్తి. ఆమె వ్యక్తిగత విజయమే కాక, ఆడపిల్లల చదువుపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరికీ గర్వకారణం.

– బాలచెలిమి డెస్క్

విజ్ఞాన ఆవిష్కరణ కథలు

# కళ్ళద్దాలతో దూరదర్శిని సూత్రం





డచ్చి దేశంలో హాన్స్ లిప్పర్షే అనే కళ్ళజోళ్ళ వ్యాపారి ఉండేవాడు. అతడు రకరకాల కళ్ళజోళ్ళు తయారు చేయటంలో నిపుణుడు. అద్దాలను అరగ దీయటంలో ప్రసిద్ధుడు. 1608వ సంవత్సరంలో ఒక రోజు – రెండు అద్దాలు అరగదీయ సాగాడు. అరగదీసి, అరగదీసి వాటినొక ఆకారానికి తెచ్చాడు. అవి సరిగ్గా కనిపిస్తున్నాయో, లేదోనని పరీక్షించదలిచాడు. రెంటినీ రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. ఒక దాని కొకటి ఎదంగా సమానాంతరంగా ఉంచి చూశాడు. ఆశ్చర్యం! అతనికి దూరంగా ఉన్న చర్చి – ఆ అద్దాల్లో, తలకిందులుగా దగ్గిరగా కనిపించింది.

మళ్ళీ మళ్ళీ చూశాడు. అతడికది వింతగా తోచింది. ఆ రెండు అద్దాల్నీ దూరం, దూరంగా ఓ గొట్టంలో బిగించాడు. తన షాపుకి వచ్చిన వారికి అందరికీ చూపసాగాడు. అది చూసిన వారంతా చాలా ఆశ్చర్యపడ్డారు. దూరంగా ఉన్న దృశ్యాన్ని దగ్గరగా చూపుతుంది. కాబట్టి దానిని 'టెలిస్కోపు' అన్నారు. మనం 'దూరదర్శిని' అంటున్నాం.

అదే కాలంలో ఇటలీ దేశంలో పీసా నగరంలో గెలీలియో అనే విజ్ఞాని ఉన్నాడు. ఆయన మహా పండితుడు. లిప్పర్షే సాధనం గురించి ఆయన విన్నాడు. దానికి కొన్ని మార్పులూ, చేర్పులూ చేసి పెద్దదిగా నిర్మించాడు. దానితో ఖగోళంలో గల గ్రహాల్ని పరిశీలించాడు. ఎన్నో వింత విషయాలు ప్రపంచానికి తెలియ జేశాడు.

తరువాత సర్ ఐజాక్ న్యూటన్ కూడా దానిలో కొన్ని మార్పులు చేశాడు. దూరంగా ఉన్న దృశ్యాలు బాగా కనిపించే ఏర్పాటు చేశాడు. ప్రస్తుతం 'దూరదర్శిని' చాలా అభివృద్ధి చెందింది. చాలా దేశాల్లో ఖగోళాన్ని పరిశీలించటానికి 'దూరదర్శనులు' స్థాపించారు. అమెరికాలో పాలమార్ పర్వతం మీద 200 అంగుళాల 'దూరదర్శిని' ఉంది. ఇంత కంటే పెద్దదైన 240 అంగుళాల దానిని రష్యా దేశంలోని కాకసస్ పర్వతాల్లో నిర్మించారు. అవి అంతరిక్షంలోని గ్రహాల్ని, నక్షత్రాల్ని కనుచూపు దూరంలో ఉండేలా చూపగలుగుతున్నాయి. దీనివల్ల ఖగోళాన్ని గురించిన ఎన్నో విషయాలు మనకు తెలుస్తున్నాయి.

– 'బాల కథా సౌరభం' నుండి...

# ఎక్కడిదమ్మా... ఈ కోతీ



ఎక్కడిదమ్మా.. ఈ కోతీ
ఇక్కడికెందుకు వచ్చిందీ...
కొండలదమ్మా ఈ కోతీ
కొబ్బరి కొరకూ వచ్చిందీ
చెన్నైదమ్మా ఈ కోతీ
శనిగల కొరకూ వచ్చిందీ
ఢిల్లీదమ్మా ఈ కోతీ
పల్లీ కొరకూ వచ్చిందీ
ముంబైదమ్మా ఈ కోతీ
మురుకుల కొరకూ వచ్చిందీ
పట్నందమ్మా ఈ కోతీ
కట్నం కొరకూ వచ్చిందీ
ఎక్కడిదమ్మా ఈ కోతీ
ఇక్కడికెందుకు వచ్చిందీ...
అమెరికదమ్మా ఈ కోతీ
అరిసెల కొరకూ వచ్చిందీ..
లండనుదమ్మా ఈ కోతీ
కొండల కొరకూ వచ్చిందీ..
ఎక్కడిదమ్మా ఈ కోతీ
ఇక్కడికెందుకు వచ్చింది?


– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105


✧ బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : -------------------
తండ్రి పేరు : -------------------
పుట్టినతేదీ : -------------------
చిరునామా : -------------------
-------------------
-------------------
పిన్ : -------------------
హాబీలు : -------------------
మొబైల్ : -------------------
ఇ-మెయిల్ : -------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.


బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com












# భారతదేశ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో 2025లో కీలక పురోగతులు

### విక్రమ్-32 మైక్రోప్రాసెసర్

భారత ఇంజనీర్లు రూపకల్పన చేసిన తొలి 32-బిట్ స్వదేశీ మైక్రోప్రాసెసర్ 'విక్రమ్-32' ను సెమీకాన్ ఇండియా 2025లో ఆవిష్కరించారు. ఈ మైక్రోప్రాసెసర్ ISRO రాకెట్లు, ఉపగ్రహాల్లో నావిగేషన్, గైడెన్స్ (దిశ నియంత్రణ), మిషన్ కంట్రోల్ వంటి కీలక వ్యవహారాల్లో ఉపయోగించబడుతుంది. దీని ద్వారా భారత అంతరిక్ష పరిశోధన రంగంలో స్వీయాధారిత సాంకేతికత మరింత బలోపేతం అవుతుంది.

### ఆంటీ-డోపింగ్ రిఫరెన్స్ మెటీరియల్


భారతదేశం తొలి సారిగా క్రీడల్లో డోపింగ్ పరీక్షలకు అవసరమైన రసాయన రిఫరెన్స్ మెటీరియల్‌ను స్థానికంగా అభివృద్ధి చేసింది. ఇది ప్రయోగశాలల్లో విశ్వసనీయమైన పరీక్షా ప్రమాణంగా ఉపయోగ పడుతుంది. దీంతో క్రీడల్లో నిష్పక్షపాత పోటీ, స్వావలంబన, నమ్మకం పెరుగుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు సరిగ్గా సరిపోవడం వల్ల, భారత క్రీడాకారులు మరియు పరీక్షా కేంద్రాలకు ఇది ఎంతో లాభదాయకం.

### NIRF ర్యాంకింగ్స్‌లో SDG విభాగం

2025 NIRF ర్యాంకింగ్స్‌లో కొత్తగా Sustainable Development Goals (SDGs) విభాగం ప్రవేశపెట్టబడింది. ఈ కొత్త విభాగం ద్వారా విద్యాసంస్థలు పర్యావరణ సుస్థిరత, సమాజంపై ప్రభావం, సమాజంలో సమాగమం వంటి అంశాలలో చేసిన కృషిని అంచనా వేస్తారు. ఈ కొత్త SDG ర్యాంకింగ్‌లో IIT మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. SDG విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సంస్థలు: Indian Agricultural Research Institute (IARI), ఢిల్లీ, జామియా మిల్లియా ఇస్లామియా, ఢిల్లీ, SRM Institute of Science and Technology, చెన్నై, Manipal Academy of Higher Education (MAHE), మణిపాల్, Jawaharlal Nehru University (JNU), ఢిల్లీ, Banaras Hindu University (BHU), వారణాసి NIRF 2025 ద్వారా విద్యాసంస్థలు తమ విద్య, పరిశోధన, వాతావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై సమగ్రమైన పనితీరును ప్రదర్శించేందుకు ప్రోత్సాహం పొందుతున్నాయి. ఈ ర్యాంకింగ్ విద్యార్థులు మరియు భవిష్యత్తు నాయకులకు హరిత, సుస్థిరమైన భవిష్యత్తు కోసం అవసరమైన దిశలో పాఠశాలలు, కళాశాలలను ఎంచుకోవడానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.












### భారత్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్ (BFS)

2025 మే 26న, భారత వాతావరణ విభాగం (IMD) అభివృద్ధి చేసిన భారత్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్ (BFS) ను ప్రారంభించారు.

**ఈ ఆధునిక వాతావరణ నమూనా వ్యవస్థ:** 6 కిలోమీటర్ల గ్రిడ్ స్థాయిలో పనిచేస్తుంది, దీని ద్వారా స్వల్పకాల (short-term) మరియు మధ్యకాల (medium-range) వాతావరణ అంచనాలు మరింత ఖచ్చితంగా మరియు ప్రాంతానుసారంగా అందించగలగడం సాధ్యమవుతుంది. BFS వ్యవస్థ రైతులు, విపత్తు నిర్వహణ సంస్థలు, నగర ప్రణాళిక మరియు రవాణా రంగాల కోసం కీలకంగా మారనుంది.

**స్వదేశీ "ఇండస్" క్వాంటం కంప్యూటర్:** 2025 ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా, భారతీయ స్టార్టప్ QpiAI అభివృద్ధి చేసిన 25-క్విబిట్ క్వాంటం కంప్యూటర్ "ఇండస్" ను నేషనల్ క్వాంటం మిషన్ కింద అధికారికంగా విడుదల చేశారు. ఇది భారతదేశంలో పూర్తిగా స్వదేశీగా రూపుదిద్దుకున్న తొలి ఫుల్-స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ సిస్టమ్.

**"ఇండస్" ప్రత్యేకత:** క్వాంటం హార్డ్వేర్ నుండి AI ఆధారిత సాఫ్ట్‌వేర్ వరకు అన్నింటినీ కలిపి రూపొందించబడింది. లోపాలు తక్కువగా మరియు వేగవంతంగా క్లిష్టమైన గణనలను నిర్వహిస్తుంది. 25 క్విబిట్ సామర్థ్యం కలిగి ఉంది. ఇది Quantum-HPC (High Performance Computing) సాఫ్ట్‌వేర్, ఖచ్చితమైన కంట్రోల్ సిస్టమ్స్‌తో వస్తుంది.

### సాంకేతిక ప్రయోజనాలు:

జీవ విజ్ఞానాలు, ఔషధ అభివృద్ధి, పదార్థ శాస్త్రం, రవాణా, సస్టైనబిలిటీ వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుంది. భారతదేశాన్ని గ్లోబల్ క్వాంటం రంగంలో ప్రముఖ స్థానానికి తీసుకు వెళుతుంది. "ఇండస్" ద్వారా భారత్ క్వాంటం కంప్యూటింగ్ రంగంలో కీలక స్థానం పొందింది, ఇది భవిష్యత్తులో మరింత అభివృద్ధికి, పరిశోధనలకు దోహదపడుతుంది.

### సూపర్ కంప్యూటింగ్ పురోగతి

భారతదేశం సూపర్ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని 32 పెటాఫ్లాప్స్‌కి పెంచింది. భవిష్యత్తులో ఈ సామర్థ్యాన్ని 77 పెటాఫ్లాప్స్ వరకూ విస్తరించనుంది. ఇది డేటా సైన్స్, వాతావరణ అంచనాలు, ఔషధ పరిశోధనలాంటి రంగాలకు కీలక మద్దతు ఇస్తుంది.

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) - భారత్‌జెన్

భారత్‌జెన్ అనే తొలి స్వదేశీ బహుభాషా, మల్టీమోడల్ LLMను ఆవిష్కరించారు. ఇది భారతీయ భాషలతో పాటు విజువల్, వాయిస్, టెక్స్ట్ డేటాను కూడా అర్థం చేసుకొని స్పందిస్తుంది.

### క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధన

IISER పుణేలోని I-HUB Quantum ద్వారా భారతీయ స్టార్టప్స్‌కి నిధుల మంజూరు జరిగింది. దీని ద్వారా దేశంలో క్వాంటమ్ కమ్యూనికేషన్, కంప్యూటింగ్, సెన్సింగ్ రంగాల పరిశోధన మరింత బలపడుతుంది.

### అదిత్య-L1లో SUIT ప్రయోగం

అదిత్య-L1 ఉపగ్రహంలో ఉన్న Solar Ultraviolet Imaging Telescope (SUIT) 200 నుండి 400 nm UV తరంగ దైర్ఘ్యంలో సూర్యుడిని పరిశీలిస్తుంది. ఇది సౌర వాతావరణంలో జరిగిన శక్తివంతమైన సంఘటనలపై ముఖ్యమైన డేటాను సమకూర్చింది. SUIT ముఖ్యంగా సౌర జ్వాలలు, సౌర క్రోమోస్ఫియర్ మార్పులు, మరియు Near-UV స్పెక్ట్రమ్‌లో కనిపించే పరిమాణాలను విశ్లేషించేందుకు ఉపయోగపడుతుంది. ఇది సూర్యుని వాతావరణం గురించి సమగ్ర అవగాహనకు దోహదం చేస్తున్న ఒక ప్రముఖ సాంకేతిక పరికరం. అదిత్య-L1 ఉపగ్రహం, భూమి నుండి సుమారు 1.5 కోట్ల కిమీ దూరంలో ఉండే లాగ్రాంజ్ 1 (L1) బిందువు చుట్టూ హాలో ఆర్బిట్‌లో ఉంటుంది, అందువల్ల గ్రహణ సమయంలో కూడా సూర్యుడిని నిరంతరం గమనించగలదు.

ఈ మిషన్ ద్వారా సూర్యుడి క్రియాశీలత, సౌర జ్వాలల ప్రభావం, సౌర వాతావరణం స్థితుల పై వివరాలు తెలియజేస్తాయి. ఇది భవిష్యత్తులో సౌర తుఫానుల ప్రభావాలను ముందస్తుగానే అంచనా వేయడంలో సహాయ పడుతుంది.

- యోగిత
హైదరాబాద్




# నిజమైన స్నేహితుడు

ఇద్దరు స్నేహితులు సెలవు రోజు ఊరి వెలుపలికి షికారుకు వెళ్లారు. తోవలో మాట్లాడుకుంటూ ఏదో విషయంపై అభిప్రాయం కుదరక ఇద్దరు వాదించుకున్నారు. వాదన ఎక్కువై మొదటి వాడు రెండోవాడిని చెంపపై కొట్టాడు. దెబ్బ తిన్నవాడు అక్కడున్న ఇసుకపై 'ఈ రోజు నా స్నేహితుడు నా చెంపపై కొట్టాడు' అని రాశాడు. మళ్ళీ ఇద్దరూ ముందుకు నడిచారు.

మరికొంత దూరం వెళ్లాక ఇద్దరికీ దాహం వేసి ఓ మడుగు దగ్గరకు వెళ్లారు. చెంప దెబ్బ తిన్న మిత్రుడు ముందు నీళ్లలోకి దిగాడు. అక్కడ ఊబి ఉంది. అతడు ఊబిలోకి కూరుకుపోతుండగా వెంటనే ప్యాంటు విప్పి మిత్రుడికి దాన్ని అందించి బయటకు లాగాడు మొదటి మిత్రుడు. బయటపడ్డాక రెండోవాడు ఓ బండరాయిపై 'ఈ రోజు నా మిత్రుడు నన్ను ప్రమాదం నుంచి రక్షించాడు' అని చెక్కాడు. మొదటి విషయాన్ని ఇసుకపై, రెండోదాన్ని రాయిపై ఎందుకు రాశావని మిత్రుడు అడగ్గా, 'ఇసుక మీద ఏదైనా రాస్తే గాలి వీచి కాసేపటికి చెరిగిపోతుంది. స్నేహుతులు పొరపాట్లను మనసులో నిలుపుకోకూడదు. కనుక అలా రాశాను. అదే సహాయం చేసినపుడు శాశ్వతంగా గుర్తించుకోవాలి. అందుకే రాయిపై రాశాను' అని చెప్పాడు.

నీతి : స్నేహితులే కాదు, ఎవరు తప్పు చేసినా క్షమించి మరచిపోవాలి, వారు చేసిన సహాయాన్ని మాత్రం కలకాలం గుర్తించుకోవాలి.

– ఎ. మృదుల
ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్





# కలంచెలిమి



**హెడావ్ యోగేష్**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్, ఆదిలాబాద్ జిల్లా.



**పి. లతిక**
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
సిరిపూర్, నిజామాబాద్ జిల్లా.



**పొట్టోళ్ల జయంతి**
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, బక్రిచెప్యాల
జిల్లా: సిద్దిపేట



**వి. నీలేష్**
6వ తరగతి, ప్రభుత్వ బాలికల ఉన్నత
పాఠశాల, గర్లపహాడ్, కోయిల్‌కొండ,
మహబూబ్‌నగర్



**పొట్టె పాక అభినయ**
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత
పాఠశాల, చిన్న మాదారం,
మండల్ కనగల్లు, నల్లగొండ జిల్లా.



**కె.ఎస్. హేమంత్**
8వ తరగతి, కె.సి. ప్రభుత్వ ఉన్నత
పాఠశాల, కళ్యాణ్‌దుర్గ్, అనంతపూర్.



# భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన సవరణల జాబితా

(గత సంచిక తరువాత...)

## భారత రాజ్యాంగంలో ముఖ్యమైన సవరణలు

| రాజ్యాంగ సవరణ | మార్పులు ప్రవేశపెట్టబడ్డాయి |
|---|---|
| 51వ సవరణ చట్టం, 1984 | మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ మరియు మిజోరాంలలోని షెడ్యూల్డ్ తెగలకు లోక్‌సభలో సీట్ల రిజర్వేషన్లను, అలాగే మేఘాలయ మరియు నాగాలాండ్ శాసనసభలలోని సీట్లను రిజర్వేషన్ చేయడాన్ని ఏర్పాటు చేయడం. |
| 52వ సవరణ చట్టం, 1985 | • ఈ సవరణ చట్టాన్ని ఫిరాయింపు నిరోధక చట్టం అని కూడా అంటారు. • ఫిరాయింపుల కారణంగా పార్లమెంటు మరియు రాష్ట్ర శాసనసభ సభ్యులను అనర్హులుగా ప్రకటించడానికి ఈ చట్టం వీలు కల్పించింది. • దీనికి సంబంధించిన వివరాలను కలిగి ఉన్న కొత్త పదో షెడ్యూల్‌ను చేర్చడం. |
| 61వ సవరణ చట్టం, 1989 | • లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించారు. |
| 65వ సవరణ చట్టం, 1990 | • షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల కోసం ప్రత్యేక అధికారి లేదా ఎస్సీలు మరియు ఎస్టీల స్థానంలో జాతీయ కమిషన్ ఏర్పాటుకు నిబంధన. |
| 69వ సవరణ చట్టం, 1991 | • ఢిల్లీని 'ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం'గా మార్చడంతో పాటు, ఢిల్లీకి 70 మంది సభ్యుల అసెంబ్లీ మరియు 7 మంది సభ్యుల మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. |
| 73వ సవరణ చట్టం, 1992 | • పంచాయతీరాజ్ సంస్థల అధికారాలు మరియు విధులను వివరించే పదకొండవ షెడ్యూల్ కింద పంచాయతీరాజ్ సంస్థలను చేర్చారు. • పంచాయతీరాజ్ వ్యవస్థలో మూడంచెల నమూనా, ఎస్సీ, ఎస్టీలకు జనాభా నిష్పత్తి ప్రకారం సీట్ల రిజర్వేషన్, మహిళలకు మూడో వంతు సీట్ల రిజర్వేషన్లు కల్పించారు. |
| 74వ సవరణ చట్టం, 1992 | • ఈ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా మరియు రక్షణను కల్పించింది. • ఈ ప్రయోజనం కోసం, సవరణ "మునిసిపాలిటీలు" అనే కొత్త భాగం IX-Aని జోడించింది. • మునిసిపాలిటీల యొక్క 18 క్రియాత్మక అంశాలను కలిగి ఉన్న కొత్త పన్నెండవ షెడ్యూల్‌ను చేర్చారు. |
| 76వ సవరణ చట్టం, 1994 | • ఈ చట్టంలో 1994 తమిళనాడు రిజర్వేషన్ చట్టం ఉంది, ఇది న్యాయ సమీక్ష నుండి రక్షించడానికి తొమ్మిదవ షెడ్యూల్‌లోని విద్యా సంస్థలలో మరియు రాష్ట్ర సేవలలో పోస్టులలో 69 శాతం రిజర్వేషన్లను అందిస్తుంది. • 1992లో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని తీర్పు ఇచ్చింది. |
| 77వ సవరణ చట్టం, 1995 | • షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలు 1955 నుండి పదోన్నతిలో రిజర్వేషన్లను అనుభవిస్తున్నారు. • ఈ చట్టం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలలో పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. • పదోన్నతుల్లో రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయడం. |

| | |
|---|---|
| 80వ సవరణ చట్టం, 2000 | • కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పన్నులను పంచుకోవడానికి ఆదాయ వికేంద్రీకరణకు ప్రత్యామ్నాయ పథకం అమలులోకి వచ్చింది. |
| 85వ సవరణ చట్టం, 2001 | • షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు రిజర్వేషన్ నియమం ప్రకారం పదోన్నతి విషయంలో "పర్యవసానంగా సీనియారిటీ" కోసం నిబంధనను అందించారు. |
| 86వ సవరణ చట్టం, 2002 | • ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. • కొత్తగా జోడించబడిన ఆర్టికల్ 21-A "రాష్ట్రం నిర్ణయించే విధంగా ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించాలి" అని ప్రకటిస్తుంది. • ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 45 యొక్క విషయాన్ని మార్చారు. • ఆర్టికల్ 51-A కింద కొత్త ప్రాథమిక విధిని చేర్చడం, దీని ప్రకారం - ఆరు నుండి పద్నాలుగు సంవత్సరాల మధ్య వయస్సు గల తన బిడ్డ లేదా పిల్లలకు విద్యకు అవకాశాలను కల్పించడం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు అయిన ప్రతి భారత పౌరుడి విధి. |
| 91వ సవరణ చట్టం, 2003 | • ఫిరాయింపుదారులను ప్రభుత్వ పదవులు చేపట్టకుండా నిషేధించడానికి మరియు ఫిరాయింపు నిరోధక చట్టాన్ని బలోపేతం చేయడానికి కేంద్రంలో మరియు రాష్ట్రాలలో మంత్రి మండలి పరిమాణాన్ని పరిమితం చేసింది. |
| 93వ సవరణ చట్టం, 2005 | • మైనారిటీ విద్యా సంస్థలు మినహా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలలో సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు |
| 97వ సవరణ చట్టం, 2012 | • ఈ చట్టం సహకార సంఘాలకు రాజ్యాంగ హోదా మరియు రక్షణను ఇచ్చింది. |
| 99వ సవరణ చట్టం, 2014 | • సుప్రీంకోర్టు మరియు హైకోర్టులకు న్యాయమూర్తులను నియమించే కొలీజియం వ్యవస్థను జాతీయ న్యాయ నియామక కమిషన్ (NJAC) అనే కొత్త సంస్థతో భర్తీ చేయడం. • అయితే, 2015లో, సుప్రీంకోర్టు ఈ సవరణ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని మరియు చెల్లదని ప్రకటించింది. తత్ఫలితంగా, మునుపటి కొలీజియం వ్యవస్థ అమలులోకి వచ్చింది. |
| 100వ సవరణ చట్టం, 2015 | • భారతదేశం మరియు బంగ్లాదేశ్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం మరియు దాని ప్రోటోకాల్ ప్రకారం భారతదేశం భూభాగాలను స్వాధీనం చేసుకోవడం మరియు కొన్ని భూభాగాలను బంగ్లాదేశ్‌కు బదిలీ చేయడానికి ఈ చట్టం భారత రాజ్యాంగాన్ని సవరించింది. |
| 101వ సవరణ చట్టం, 2016 | • ఇది భారతదేశంలో వస్తువులు మరియు సేవల పన్ను (GST)ని ప్రవేశపెట్టింది. • ఈ సవరణను పార్లమెంటు మరియు రాష్ట్రాలు ఆమోదించాయి మరియు జూలై 1, 2017 నుండి అమల్లోకి వచ్చాయి. |
| 102వ సవరణ చట్టం, 2018 | • జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించారు. • ఈ చట్టం ద్వారా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్‌ను వెనుకబడిన తరగతులకు సంబంధించిన విధుల నుండి తప్పించారు. • ఒక రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించి సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులను పేర్కొనడానికి ఇది రాష్ట్రపతికి అధికారం ఇచ్చింది. |
| 103వ సవరణ చట్టం, 2019 | • ఆర్థికంగా బలహీన వర్గాల (EWS) పౌరుల అభ్యున్నతికి ఏదైనా ప్రత్యేక నిబంధన చేయడానికి రాష్ట్రానికి అధికారం ఇచ్చింది. • EWS కేటగిరీ ప్రయోజనాలను పొందడానికి EWS సర్టిఫికేట్ అవసరం. • మైనారిటీ విద్యా సంస్థలను మినహాయించి, రాష్ట్రం సహాయం పొందిన లేదా సహాయం చేయని ప్రైవేట్ విద్యా సంస్థలతో సహా విద్యా సంస్థల్లో ప్రవేశానికి వచ్చినప్పుడు కొన్ని వర్గాలకు 10% వరకు సీట్లను కేటాయించడానికి రాష్ట్రానికి అనుమతి ఉంది. ఇప్పటికే ఉన్న వాటికి అదనంగా 10% వరకు ఈ అదనపు రిజర్వేషన్లు కల్పించబడతాయి. |
| 104వ సవరణ చట్టం, 2020 | • లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో ఎస్సీ, ఎస్టీ సీట్ల రద్దు గడువును 70 నుంచి 80 ఏళ్లకు పొడిగించారు. • లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీలలో ఆంగ్లో-ఇండియన్ సమాజానికి రిజర్వ్ చేయబడిన సీట్ల తొలగింపు. |
| 105వ సవరణ చట్టం, 2020 | • సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతులను (SEBCs) గుర్తించడానికి మరియు గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల అధికారాన్ని ఇది పునరుద్ధరించింది. • ఈ సవరణ ఆగస్టు 15, 2021 నుండి అమల్లోకి వచ్చింది. |
| 106వ సవరణ చట్టం, 2020 | • దీనిని మహిళా రిజర్వేషన్ చట్టం అని కూడా అంటారు. • ఇది లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను రిజర్వ్ చేస్తుంది. • ఈ సవరణ సెప్టెంబర్ 2023లో ఆమోదించబడింది మరియు సెప్టెంబర్ 28, 2023న రాష్ట్రపతి ఆమోదం పొందింది. |

కథ

# అలా జరగాల్సిందే



గుబురుగా ఉన్న జామ చెట్టు తొర్రలో చిలుక నివాసం ఏర్పాటు చేసుకుంది. ఆకుపచ్చ రంగుకు మించిన రంగులేదని అనుకున్న చిలుక తనదే నిజమైన అందమని భావించుకొనేది. అదే చెట్టు మీద పిచ్చుక గూడు కట్టుకోడానికి వచ్చింది. 'నా రంగుకు నీ రంగుకు పోలికే లేదు. ఇక్కడ గూడు కట్టుకోడానికి వీలులేదు' దబాయించింది చిలుక. చిన్నబుచ్చుకున్న పిచ్చుక అక్కడ నుండి వెళ్ళి పోయింది. ఇప్పుడు గూడు కట్టుకోడానికి కాకి అక్కడకు వచ్చింది. 'నలుపు రంగంటే నాకు ఇష్టం లేదు. ఇక్కడ గూడు కట్టడానికి నేను ఒప్పుకోను' నిప్పులు చెరిగింది చిలుక.

'రంగులో ఏముంది? ఒకరికి ఒకరు తోడుంటే అన్ని విధాలా మేలే గదా!' అడిగింది కాకి. 'ముందునుంచీ ఈ చెట్టును నేను ఆశ్రయించాను. కాబట్టి అన్ని హక్కులు నావే' మొండిగా వాదించింది చిలుక.

ప్రశాంతత కోరుకున్న కాకి అక్కడ నుండి వెళ్ళిపోయింది. ఆ తరువాత కొంగ వచ్చింది. దాని పొడవాటి ముక్కు చూసి మొదట భయపడినా 'కొంగ మిత్రమా ఏమిటి సంగతి ఇలా వచ్చావు?' అడిగింది చిలుక.

'ఈ చెట్టు మీద గూడు కట్టుకోడానికి' చెప్పింది కొంగ. ఈ చెట్టు తొర్రలో పాము ఉంది. నాదంటే ఆకుల్లో కలిసే రంగు. దానికి కనిపించకుండా మసలుకోగలను. నీది తెల్లని రంగు. దాని నోటికి సులభంగా దొరికిపోగలవు' పిరికి మందు వేసింది చిలుక. భయపడి పారిపోయింది కొంగ. 'భలే..భలే... నీ తెలివి! తొర్రలో పాము ఉంటే నువ్వు ఉండవుగా.. పక్షులు ఎక్కువైతే నీ సుఖ జీవనానికి అడ్డని మంచి ఎత్తేవేశావు' అంటూ వెనుక నుండి మాటలు వినిపించాయి. తన తెలివిని గుర్తించేది ఎవరా అని వెనుదిరిగి చూసింది చిలుక. ఎవరూ కనిపించలేదు.

'ఇటువైపు చూడు అక్కా!' అంటూ ఎగురుకుంటూ చిలుక ముందు వాలిందది. తన రంగునే పోలి ఉండడంతో 'నువ్వు నాకు చుట్టమా?' ఆప్యాయంగా పలకరించింది. 'అవును! నీకు చెల్లెలు వరుస అవుతాను. కొంపదీసి నన్ను కూడా పొమ్మంటావేమిటి?' అడిగిందది.

'మన రంగులు కలిసాయి. దానికి తోడు నా చెల్లెలంటున్నావు. నిన్ను ఎక్కడైనా పొమ్మంటానా?' అంది చిలుక. 'నీ ఆప్యాయత చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఈ చెట్టు గురించి, నీ గురించి మిగిలిన నా చెల్లెల్లుకు చెప్పి ఓ సారి తీసుకొస్తాను' అంటూ తుర్రున ఎగిరిపోయిందది.

మర్నాడు తన చెల్లెల్ల బృందంతో వచ్చిందది. 'ఇంతమంది చెల్లెల్లు ఉన్నారా?' అంటూ ఆశ్చర్యపోయింది చిలుక. కొద్ది క్షణాలు గడిచాక చెట్టంతా బోడిగా తయారైంది. తన ఉనికి శత్రువులకు తెలిసినట్టు ఇప్పుడు ఆ చెట్టు తయారైంది. వచ్చిన చెల్లెల్లు ఎగిరిపోయాయి. ఆకుల్లేని ఆ చెట్టు పళ్ళు, కాయలనివ్వదు, రాబోయే రోజుల్లో ఆహార సమస్యను తలచుకొని గొల్లుమంది చిలుక. అదే సమయంలో అటువైపు వస్తున్న కాకి 'నీ రంగని ఆ మిడతల్ని నెత్తినెక్కించుకున్నందుకు, నిన్ను నిండా ముంచాయి. మేమంతా ఆ చెట్టుపై ఉంటే కలిసిపోరాడి చెట్టును కొంతలో కొంతైనా రక్షించుకొనేవాళ్ళం' సతాయిస్తూ ఎగిరి పోయింది. 'రంగును నమ్మి కోరి వచ్చిన మిత్రులను కాలదన్నుకున్నందుకు మంచి గుణపాఠమే నేర్పాయవి' అని చిలుక చివరకు పశ్చాత్తాపపడింది.

బి.వి.పట్నాయక్
m : 8309872913

జంతువు

### ప్రపంచంలో అత్యంత అపూర్వమైన

# పాంగోలిన్‌లు

### తెగుళ్ళ నియంత్రణలో సహజ మార్గదర్శకులు



పాంగోలిన్‌లు ప్రపంచంలో అత్యంత విచిత్రమైన క్షీరదాలలో ఒకటిగా గుర్తించబడతాయి. చీమలు, చెదపురుగులు వేటాడే వీటి పొడవాటి నాలుక శరీర పొడవులో సగం వరకు ఉండి ఆహారాన్ని సులభంగా సేకరించేందుకు సహకరిస్తుంది. వీటికి పళ్లు లేకపోయినా గట్టి పొలుసులు రక్షణగా పని చేస్తాయి. పొలుసుల నిర్మాణంలో మనిషి జుట్టు, గోర్లలో ఉండే కెరాటిన్ పదార్థమే ఉంటుంది. ప్రమాదం ఎదురైనపుడు వేటగాళ్ల నుండి రక్షణ కోసం బంతిలా తాము ముడుచుకొని దాక్కోవడం వీటి ప్రత్యేకత.

ఎనిమిది రకాల పాంగోలిన్‌లు ప్రపంచంలో ఉన్నాయి. ఆసియాలో నాలుగు, ఆఫ్రికాలో నాలుగు జాతులు ఉన్నాయి. భారతదేశంలో కనిపించే ఇండియన్ పాంగోలిన్ ముఖ్యంగా శ్రీశైలం అడవుల్లో కనిపిస్తుంది. చైనీస్, సుండా, పలావాన్ పాంగోలిన్‌లు ఆసియాలో ఉండగా, గ్రౌండ్, జెయింట్, తెల్లటి బొడ్డు, నల్లటి బొడ్డు పాంగోలిన్‌లు ఆఫ్రికాలో కనిపిస్తాయి. వీటిలో కొన్ని చెట్లలో నివసిస్తాయి, మరికొన్ని నేలలో బొరియలు తవ్వుకుంటాయి. రాత్రి వేళ ఎక్కువగా చురుకుగా తిరిగే వీటిని పగటిపూట చెట్లలో లేదా బొరియల్లో విశ్రాంతి తీసుకుంటూ కనిపిస్తాయి.

పిల్లలు పుడుతూనే పొలుసులు మృదువుగా ఉంటాయి, కాలక్రమంలో గట్టిపడతాయి. తల్లి తోకమీద పిల్లను మోసుకుంటూ కాపాడుతుంది. సాధారణంగా ఒక్క పిల్ల పుడుతుందని ఉన్నా, కొన్ని జాతుల్లో రెండో మూడో పుట్టిన సందర్భాలు ఉన్నాయి. పిల్లలు మొదట తల్లి పాలపై ఆధారపడతారు, అనంతరం చీమలు చెద పురుగులు తినడం మొదలు పెడతారు. పాంగోలిన్‌ల బరువు 1.6 కిలోల నుండి 33 కిలోల వరకు ఉండవచ్చు. చర్మరంగు లేత గోధుమ నుండి ముదురు గోధుమ వరకు కనిపిస్తుంది. వీటి వాసన శక్తి ఎక్కువ, దాని ద్వారానే ఆహారం సులభంగా గుర్తిస్తాయి. తవ్వడం, ఎక్కడం కోసం ఐదు వేళ్లతో కూడిన పాదాలు ప్రధానంగా సహాయపడతాయి. కొన్ని జాతులు చెట్లపై చాకచక్యంగా ఎక్కడం కోసం తోకను ఉపయోగిస్తాయి.

పాంగోలిన్‌లు తవ్వే బొరియలు లోతుగా ఉంటాయి, చైనీస్ పాంగోలిన్‌లు శీతాకాలంలో వాటి లోపలే ఎక్కువ కాలం గడుపుతాయి. సహజ ఆహారంపై మాత్రమే ఆధారపడటం వలన వీటిని బంధించి పెంచడం కష్టతరం. తినకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. సంవత్సరానికి కోట్లకొద్దీ కీటకాలను తినడం వలన పాంగోలిన్‌లు ప్రకృతిలో సహజ తెగుళ్ల నియంత్రకులుగా వ్యవహరించి పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి.

అయితే వేట, మాంసం వాడకం, పొలుసులను ఔషధాలుగా అక్రమంగా విక్రయించడం, నివాస అడవుల తగ్గుదల కారణంగా ఇవి తీవ్రమైన ముప్పులో ఉన్నాయి. యునైటెడ్ నేషన్స్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అక్రమ రవాణా అయ్యే వన్య ప్రాణులు పాంగోలిన్‌లు. అందువలన వీటిని కాపాడడం మనందరి బాధ్యత. పాంగోలిన్‌లు బతికే వాతావరణం ఉన్నంత వరకు ప్రకృతి సమతుల్యం కాపాడబడుతుంది. అవి నశిస్తే పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. కనుక పాంగోలిన్‌లను రక్షించడం అంటే జీవవైవిధ్యాన్ని, ప్రకృతిని, వాస్తవానికి మన సొంత భవిష్యత్తునే రక్షించుకోవడం.

– సచిన్ కోత్వాల్

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారెడ్డిపేట

# తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బాల చెలిమి గ్రంథాలయం ప్రారంభం





09-09-2025న సిద్ధిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట జి.ప.ఉ. పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బాల చెలిమి గ్రంథాలయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. మల్లేశం ప్రారంభించారు.



విద్యార్థుల పఠనాసక్తి పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, పుస్తకాలు చదివితే మానసిక వికాసం, పరిశీలన, ఆలోచన దృక్పథం, సృజనాత్మకత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థులు కథలు, పాటలు, చిన్న చిన్న రచనలు చేయడానికి అలవాటు చేసుకోవాలని సూచించారు.

బాల చెలిమి పుస్తకాలలోని అంశాలు విద్యార్థులను ఆకట్టుకుంటాయని, కథలు పఠనాసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి తరగతికి వారానికి రెండు మూడు పీరియడ్లు గ్రంథాలయం కోసం కేటాయించాలని వేలేటి లక్ష్మణ శాస్త్రి, (తెలుగు ఉపాధ్యాయులు) అభిప్రాయ పడ్డారు.

ఆంగ్ల కథల పుస్తకాలు చదివితే విద్యార్థుల ఆంగ్ల పఠనా నైపుణ్యం పెరుగుతుందని నాగరాణి, పద్మజ, (ఆంగ్ల ఉపాధ్యాయులు) చెప్పారు.

శాస్త్రాంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి సైన్స్ పుస్తకాలు ఎంతో ఉపయోగకరమని సి.హెచ్. రమేశ్, (సైన్స్ ఉపాధ్యాయులు) పేర్కొన్నారు.

పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యం, మానసిక మరియు సృజనాత్మక వికాసం పెరగడాన్ని గమనించవచ్చు. తరచుగా గ్రంథాలయ పుస్తకాలను చదవడం వలన విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకొని, అవగాహనలో మెరుగుదల కలుగుతుంది అని ఉపాధ్యాయులు జి. బాలకిషన్, బి. బాలకిషన్, సుజాత, సుకన్య అన్నారు.

గ్రంథాలయ పఠనం అలవాటు ద్వారా పఠనశక్తి పెరుగుతుంది మరియు తప్పులు ఉండకుండా రాయగలుగుతారని కాముని శ్రావ్య & పాతూరి దుర్గాశ్రీ (విద్యార్థులు) కూడా అన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సి.హెచ్. నాగరాజు, ఎస్. భిక్షపతి, భజన్‌లాల్, భీమరాజు, ఎన్. శ్రీనివాస్, రజిత తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

- నాగరాజు కామర్సు
(తెలుగు ఉపాధ్యాయుడు) జి.ప.ఉ.పా. పోతారెడ్డిపేట.
m : 92480 93580

## నేటి సామాజిక పరిస్థితులకు అద్దం శ్రీ కావ్యం శతకం



దాట్ల, ఖమ్మం జిల్లా: జంపాల కావ్య రచించిన శ్రీ కావ్యం శతకం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాట్లలో 11 సెప్టెంబర్ 2025న జరిగింది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా గుర్రం జాషువా సాహిత్య వేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ కవి-విశ్లేషకులు మువ్వా శ్రీనివాసరావు పాల్గొన్నారు. రచయిత్రి చిన్న వయస్సులోనే ఛందస్సుతో కూడిన శతక రచన చేసి, నేటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబించడం అత్యంత విశేషమని ఆయన అభినందించారు. ఆ కృషిలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య తర్ఫీదు కీలకమని ప్రశంసించారు. అనంతరం రచయిత్రిని, ప్రముఖ కవులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుస్తక ప్రచురణ దాత సయ్యద్ జహంగీర్, సాహితీ వేత్తలు, గ్రామ పెద్దలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## "హియర్ ఐ బిగిన్" - చిన్నారి ప్రతిభకు సాహిత్య వేదికగా రవీంద్రభారతి



14 ఆగస్టు, 2025న రవీంద్రభారతిలో అస్తిత్వం సంస్థ ఆధ్వర్యంలో చిరంజీవి లక్ష్మీపురపు సహజ రచించిన ఇంగ్లీష్ కవితా సంపుటి "Here I Begin" ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం చిరంజీవి సహజ 14 ఏళ్ల వయసులోనే సాధించిన ఒక సాహిత్య ఘట్టంగా నిలిచింది.

ఈ వేడుకలో మరో విశిష్ట ఘట్టం – ప్రముఖ రచయిత డా. వి.ఆర్. శర్మ రచించిన నవల "The Last Evolution" Chiranjivi Lakshmipurapu సహజ చేతుల మీదుగా ఆవిష్కరించబడటం.

ఈ సందర్భంగా చిన్నారి ప్రతిభ Chiranjivi Lakshmipurapu తన చురుకైన వ్యాఖ్యానంతో, తన రచన ప్రయాణం గురించి పంచుకుని, చిన్న వయసులోనే ఇంగ్లీష్ కవితా రచన ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆమె ప్రతిభకు వేదికపై ఉన్న ప్రముఖులు ప్రశంసలు కురిపించారు.

డా. వి.ఆర్. శర్మ తన నవల గురించి మాట్లాడుతూ – "ఇది నేటి సమాజంలో ఉన్న రెండు తరాల మధ్య వాస్తవ పరిస్థితులపై ఆవిష్కృతమైన ప్రయత్నం. భావోద్వేగాలు, కలలు, సంబంధాల తారతమ్యాన్ని ఈ నవలలో చూపించాను," అని వివరించారు.

ఈ సాహిత్యసభలో అస్తిత్వం సంస్థ ప్రతినిధులు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు, రచయితలు, సామాజిక వేత్తలు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు పుస్తకాల ఆవిష్కరణతో రవీంద్రభారతి వేదిక ఆ రోజు సాహిత్యస్ఫూర్తికి ప్రతీకగా మారింది.

## జాతీయ స్థాయిలో నిజామాబాద్ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మం జిల్లా వురిమల్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి కవితా, కథా రచన పోటీల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పాలొనగా, వారిలో 13 మంది విజేతలుగా నిలిచారు. ఈ విజయాలను జిల్లా డీఈవో అశోక్ అభినందిస్తూ, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల కృషిని డీఈవో ప్రశంసించారు. వేదిక అధ్యక్షుడు డాక్టర్ కాసర్ల మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో వేదిక ఎల్లప్పుడూ ముందు

ఉంటుందని తెలిపారు. ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి డి. ప్రవీణ్ కుమార్ శర్మ ఈ వేదికలో ముఖ్య పాత్రలలో ఉన్నారు.

**విజేతలు: కథా రచన:** జే. రచన, ఎం. మాధురి, కే. నిశిత, నూనె శ్రీనిధి, ఎస్. రజియా.

**కవితా రచన:** కే. అభిలాష్, ఎస్. అశ్విని, డి. ప్రియాంక, యం. మేఘన, రశ్మిత, ఎస్. విజయలక్ష్మి, సుశాంత్, జె. రచన, ఎల్. శృతిక.

## బాల చెలిమి పుస్తకాలతో విద్యార్థుల పఠనాసక్తి



యాదాద్రి భువనగిరి జిల్లా అనంతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు బాల చెలిమి గ్రంథాలయ పుస్తకాలను ఆసక్తితో చదువుతున్నారు. చిన్నారుల మానసిక వికాసానికి, భాషా నైపుణ్యాల పెంపుకు తోడ్పడే ఈ పుస్తకాలు విద్యార్థులలో పఠనపు అలవాటును, ఆలోచన శైలిని అభివృద్ధి చేస్తున్నాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

## కీర్తి పురస్కారాలు బాలసాహిత్య రంగంలో ఇద్దరికి ప్రదానం

హైదరాబాద్, సెప్టెంబర్ 2025: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రతీ ఏటా అందజేస్తున్న కీర్తి పురస్కారాలు బాలసాహిత్యంలో విశేష కృషి చేసిన ఇద్దరు ప్రముఖులకు వరించాయి.

2024 సంవత్సరానికి బాలసాహిత్యంలో చేసిన విశిష్ట సేవలకుగాను ప్రముఖ బాలసాహిత్య రచయిత డా. అమరవాది నీరజ గారికి 2023 సంవత్సరానికి బాల సాహిత్యంలో చేసిన అద్భుత కృషికి డా. గంగిశెట్టి శివకుమార్ గారికి "కీర్తి పురస్కారం" ప్రకటించారు.

ఈ విషయాన్ని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు మరియు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు గారు సంయుక్తంగా ప్రకటించారు.





## చిన్ననాటి ఆటలో చిత్తరాల ఆటలో


వీరి వీరి గుమ్మడి పండు వీధులల్ల ఆటలు
వీని పేరు ఏందని చెప్పి పాడుకున్న పాటలు
రింగురింగు బిల్లా అంటూ ఆడుకున్న ఆటలు
తీరూ తీరుగా ఊరేటి సెలయేటి ఊటలు
బడికి సెలవులొచ్చాయంటే గల్లీ మొత్తం గంతులే
చిన్నచిన్నా చింతాలల్లా చిన్నానాటి ఆటలు
గున్నాగున్నా మామిళ్లల ఎన్నోఎన్నో పాటలు
గుబ్బాచెట్లా కింద మనం ఏరుకున్న కాయలు
ఊడల మర్రికాడ మనం ఊగిన ఉయ్యాలలు
బొట్టు బిల్లా రిబ్బన్లూ గాజులు తెచ్చుకున్నం
మన అమ్మమ్మా సంచిలోన పైసలెత్తుకెళ్లి..
ఇంటి ముందల దోస్తులొచ్చి చాటుగా పిలిసేది
సైగలతోనే వస్తని చెప్పి వాళ్లను తోలేది
మామయ్య ఇంటికి పోతనని మాయబుచ్చేది
సందు దొరికితే చాలు చలో స్తరున జారేది
కాళ్లా గజ్జా కంకానమ్మా కలిసీ మెలిసీ పాడినం
వేగుచుక్కా వెలగాపండు వెన్నెల మడుగుల ఆడినం
అగడు వట్టినట్టే ముద్దలు గబాగబా మింగేది
ఆట మీద వడితే ఇల్లు యాదే మరిచేది
హద్దు పద్దు లేదని అమ్మ ఒకటే తిట్టేది
మా ఇంటి చుట్టూ గెదిమి పొరకవట్టీ కొట్టేది
అమ్మ ఎంత గొట్టినా దెబ్బలు తగలకపోయేది
ఆడుకున్నా ఆనందంలో అంతా మరిచేది
తల్లి కోడి చూడకుండా పిల్లలు పట్టేది
ఆ తల్లి ఎంబడిబడితే వదిలి ఇంట్లోకురికేది
ఊరి చెరువుల పోరలమంతా బుడుబుంగోలె మునిగేది
అడుగున అల్లి పూలను తెచ్చి దండలు మేము అల్లేది
ఎండా కొడతా ఉంటే మాకు కొమ్మా గొడుగూ వట్టేది
తాటి మట్టలు చెప్పులు చేసి రెండు కాళ్లకు కట్టేది
మళ్లీ మళ్లీ రాని ఈడున మల్లెపూలై నవ్వినం
బరువు బాధ్యత ఏది లేక బంగారంలా బతికినం
చిన్ననాటి ఆటలో చిత్తరాల ఆటలో
ఎన్నడు ఇంకిపోని గుండెలోని గుర్తులు

# డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య

## (1880-1957)

స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ నాయకుడు, ఆర్థికవేత్త, గ్రంథకర్త, ఆయన జీవితం భారత స్వాతంత్ర్యోద్యమం, ఆర్థిక రంగంలో సంస్కరణలకు ప్రతీకగా నిలిచింది.

ఆయన 1880 నవంబర్ 24న పశ్చిమ గోదావరి జిల్లా గుండుకొలను గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే విద్యాబుద్ధి కలిగిన పట్టాభి మద్రాసు క్రైస్తవ కళాశాలలో బి.ఎ. చదివి తర్వాత ఎం.బి.సి.ఎం వైద్య డిగ్రీ పొంది డాక్టర్ అయ్యాడు. 1906లో మచిలీపట్నంలో వైద్య వృత్తి ప్రారంభించాడు. కొద్ది కాలంలోనే పేరు తెచ్చుకున్నప్పటికీ, గాంధీజీ పిలుపుతో ఆ వృత్తిని వదిలిపెట్టి స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగుపెట్టాడు. "స్వాతంత్ర్యం వచ్చే వరకు ఎటువంటి వృత్తి చేయను" అని ప్రతిజ్ఞ చేశాడు.



1939లో కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి సుభాష్ చంద్రబోస్ ఎదుట పోటీ చేసి ఓడిపోయాడు. అయినప్పటికీ 1948లో కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అరెస్టై మూడు సంవత్సరాలు అహ్మద్‌నగర్ కోట జైలులో నిర్బంధించబడ్డాడు. అక్కడ రాసిన తన డైరీ తరువాత "Feathers and Stones" అనే గ్రంథంగా వెలువడింది. స్వాతంత్ర్యం అనంతరం 1952లో రాజ్యసభ సభ్యుడయ్యాడు. 1952 నుండి 1957వరకు మధ్యప్రదేశ్ గవర్నరుగా పని చేశాడు.

ఆయన ఆర్థిక రంగంలో చేసిన కృషి అపారమైనది. ఆ కాలంలో రైతులు అప్పుల బానిసలుగా బీదరికంలో ఉంటారు. వారిని రక్షించాలన్న సంకల్పంతో 1923లో ఆయన ఆంధ్రా బ్యాంకును స్థాపించారు. చిన్న మొత్తాల పొదుపు సాంప్రదాయాన్ని స్థిరపరిచారు. తరువాత ఆంధ్రా ఇన్సూరెన్స్ (1925), హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్స్ (1935)ను స్థాపించారు.

తెలుగు భాషా సంస్కృతిపై ఆయనకు గాఢమైన అభిమానం. తన సంస్థలలో లావాదేవీలు తెలుగులోనే జరగాలని కట్టుబాటు పెట్టారు. 1913లో బాపట్లలో జరిగిన తొలి ఆంధ్ర మహాసభలో ప్రముఖ పాత్ర వహించారు. ఈ అంశంపై ఒక పుస్తకాన్ని కూడా రచించారు.

గ్రంథకర్తగా ఆయన రాసిన History of Indian National Congress 1600 పుటల దీర్ఘ గ్రంథం. కేవలం రెండు నెలల్లో దాన్ని పూర్తిచేయడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తక్కువ ఆధారాలతోనే స్మృతులను ఆసరాగా తీసుకొని రాసిన ఆ గ్రంథం విశిష్ట చారిత్రక పుస్తకంగా ప్రసిద్ధి చెందింది.

ఆయన వ్యక్తిగత జీవనశైలి ఎంతో సరళం. ఖద్దరు దుస్తుల తోనే తిరిగేవారు. పదవులు కోరుకోని వ్యక్తి అయినప్పటికీ ప్రజాసేవ కోసం ఏకముఖంగా శ్రమించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవిని కూడా తిరస్కరించి ప్రజాప్రయోజనాల పన్నించాడు.

తెలుగు జాతి కోసం, భారత స్వాతంత్ర్య సమరంలో తన జీవితాన్ని అంకితం చేసిన ఈ మహనీయుడు 1957 డిసెంబర్ 17న కన్ను మూశాడు. కానీ ఆయన కృషి, సేవలు, ఆలోచనలు నేటికీ తెలుగు ప్రజలకు స్ఫూర్తిగా నిలిచాయి.

– సువేగా

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

## ప్రచురణలు

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850




పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

**-మణికొండ వేదకుమార్**
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026




Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com